- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
27-10-2026

సంపుటి : 01 సంచిక : 215 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 215 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

రక్షణ రంగానికి రూ.2.12 లక్షల కోట్ల బలం!

- భారీ సైనిక కొనుగోళ్లకు రక్షణ కొనుగోళ్ల మండలి ఆమోదం
- రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన కీలక నిర్ణయం
- 82 శాతం కొనుగోళ్లు దేశీయ పరిశ్రమల నుంచే
- సైన్యానికి అత్యాధునిక హెలికాప్టర్లు, కామికాజ్ డ్రోన్లు
- నౌకాదళం, వాయుసేన సామర్థ్యం పెంపునకు ప్రాధాన్యం



తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర సానుకూలం!

152 మీటర్ల బ్యారేజీ ప్రతిపాదనపై మహారాష్ట్ర సానుకూల స్పందన

- ముంబైలో రేవంత్‌రెడ్డి, ఫడ్నవీస్ కీలక భేటీ
- 148 మీటర్ల ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు మహారాష్ట్ర సుముఖం
- ముంపు భూములకు పూర్తి పరిహారం చెల్లిస్తామన్న తెలంగాణ
- బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై సంయుక్త అధికారుల కమిటీ
- సాంకేతిక, పర్యావరణ అంశాల పరిశీలన తర్వాతే తుది నిర్ణయం
- ఆదిలాబాద్ గిరిజనుల అభివృద్ధికి ప్రాజెక్టు కీలకమన్న సీఎం
- రెండు రాష్ట్రాల మధ్య వారధిగా తుమ్మిడిహెట్టి నిలుస్తుందని వెల్లడి

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణంపై తెలంగాణ, మహారాష్ట్ర మధ్య కీలక చర్చలు జరిగాయి. ముంబైలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. బ్యారేజీ ఎత్తును 148 నుంచి 152 మీటర్లకు పెంచాలని కోరారు. ఈ ప్రతిపాదనను పరిశీలించేందుకు ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధమని ప్రకటించింది. సాంకేతిక, పర్యావరణ అంశాల అధ్యయనం అనంతరం తుది నిర్ణయం తీసుకోనున్నారు.

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి అక్టోబర్ 26 మహాప్రభ

ఐదు దశాబ్దాలుగా ప్రతిపాదనలు, చర్చలకే పరిమితమైన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణంపై మరో కీలక ముందడుగు పడింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముంబైలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో జరిపిన సమావేశంలో బ్యారేజీ ఎత్తు పెంపు ప్రతిపాదనపై సానుకూల స్పందన లభించింది. ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మించాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు మహారాష్ట్ర అంగీకారం తెలిపింది. అయితే సాంకేతిక, పర్యావరణ, ముంపు ప్రభావాలపై సమగ్ర అధ్యయనం అనంతరమే తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల

-మిగతా 3 లో





గ్రావిటీతో నీళ్లొస్తే రాజీనామా చేస్తా..

- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి హరీశ్‌రావు సవాల్
- ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీళ్లు వస్తాయని నిరూపించాలని డిమాండ్
- నిరూపిస్తే నా రాజీనామా.. లేదంటే మంత్రి ఉత్తమ్ తప్పుకుంటారా?
- మేడిగడ్డకు మరమ్మతులు చేసి కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్
- ఏపీలో క్రాప్ హాలిడే లేనప్పుడు తెలంగాణలో ఎందుకని ప్రభుత్వాన్ని నిలదీత
- రాష్ట్రంలో కరువుకు కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణమని హరీశ్‌రావు ఆరోపణ

హైదరాబాద్, అక్టోబర్ 26 మహాప్రభ

మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓపెన్ చాలెంజ్ విసిరారు. తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీళ్లు వస్తాయని కాంగ్రెస్ సర్కార్ నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని, లేకపోతే నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రిజైన్ చేస్తా రా? అని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు సవాల్ చేశారు. గ్రావిటీ ద్వారా నీళ్లు వస్తాయని ప్రభుత్వం అబద్ధాలు చెప్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.ఆ ప్రతిపాదనకు సంబంధించిన డీపీఆర్‌ను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మాజీ ఎమ్మెల్యే బాల్క సు మన్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, గట్టు రామచందర్‌రావుతో కలిసి మీడియాతో

-మిగతా 3 లో



సిరీస్ వేటలో శ్రేయస్ సేన

- నేడు న్యూజిలాండ్‌తో మూడో టీ20
- 2-0 ఆధిక్యంతో జోరుమీదున్న టీమిండియా
- గాయంతో ఇషాన్ కిషన్ దూరం.. వైభవ్ సూర్యవంశీకి మరో ఛాన్స్
- హైదరాబాదీ తిలక్ వర్మ, నితీశ్ రెడ్డిపై భారీ ఆశలు
- బౌలింగ్‌లో పుంజుకోవాల్సిన భువనేశ్వర్ కుమార్
- గాయాలతో కివీస్‌కు ఎదురుదెబ్బ.. హెన్రీ, ఫెర్గుసన్ దూరం
- బౌలర్లు, ఫీల్డర్లకు సవాల్‌గా వెల్లింగ్టన్ ఈదురుగాలులు
- మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రసారం

ట్రంప్ ఆదేశిస్తే 96 గంటల్లో ఇరాన్‌పై దాడులు!

- పశ్చిమాసియాలో అమెరికా సైనిక బలగాల మోహరింపు
- అధ్యక్షుడి ఆదేశాల కోసం సిద్ధంగా ఉన్నట్లు అధికారుల వెల్లడి
- ఇరాన్ రాడార్లు, క్షిపణి ప్రయోగ కేంద్రాలే ప్రధాన లక్ష్యాలు
- అణు కేంద్రాలు, సైనిక స్థావరాలపైనా దాడులకు ప్రణాళికలు
- ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకునే అవకాశం
- మధ్యంతర ఎన్నికల తర్వాత కీలక నిర్ణయం వెలువడే సూచనలు
- అమెరికా వ్యూహాలను పసిగడుతున్న ఇరాన్ దళాలు

: పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ ఉద్రిక్తతలు పెరిగే అవకాశముందన్న వార్తలు వెలువడుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు జారీ చేస్తే 96 గంటల్లోనే ఇరాన్‌పై దాడులు చేపట్టేందుకు అమెరికా బలగాలు సిద్ధంగా ఉన్నట్లు సీఎన్ఎన్ కథనం వెల్లడించింది. పశ్చిమాసియాలో భారీగా సైనిక బలగాలను మోహరించిన అమెరికా.. ఇరాన్‌కు చెందిన రాడార్ వ్యవస్థలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలు, సైనిక స్థావరాలు, అణు కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకునే అవకాశముందని ఇద్దరు అధికారులను ఉటంకిస్తూ పేర్కొంది.



హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర

కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!



- నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర
- అమిత్ షా పాల్గొంటారని రామచందర్‌రావు ప్రకటన
- నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ర్యాలీ
- ఓట్ల తొలగింపు ఆరోపణలపై సీఎం రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్
- కొండారెడ్డిపల్లికి వచ్చి ఓటర్ల జాబితాను పరిశీలిద్దామని పిలుపు
- తొలగించిన పది మంది అర్హులైన ఓటర్ల వివరాలు చూపాలని డిమాండ్
- రాష్ట్రంలో కరువు, నీటి కొరతను పట్టించుకోవడం లేదని కాంగ్రెస్‌పై విమర్శలు

ఓటర్ల జాబితా సవరణ వ్యవహారంపై తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది. నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించనున్న 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి మరుసటి రోజే హైదరాబాద్‌లో భారీ పాదయాత్ర చేపట్టేందుకు బీజేపీ సిద్ధమవుతోంది. నవంబర్ 2న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ప్రకటించారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకాన్ని అడ్డుకోండి' నినాదంతో యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లు తొలగిస్తున్నారన్న కాంగ్రెస్ ఆరోపణలను ఖండించిన ఆయన, ఆధారాలతో కనీసం పది మంది ఓటర్ల వివరాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి వచ్చి ఓటర్ల జాబితాను పరిశీలిద్దామని పిలుపునిచ్చారు. మరోవైపు రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరత సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ ర్యాలీలపై దృష్టి పెడుతున్నారని విమర్శించారు.

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి అక్టోబర్ 26 మహాప్రభ

తెలంగాణలో ఓట్ల తొలగింపు అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది. నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించనున్న 'ఓట్ చోరీ' వ్యతిరేక ర్యాలీకి మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర చేపట్టనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. 'లోక్‌తంత్ర బచావో – అరాజకతా హటావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి – అరాచకాన్ని అడ్డుకోండి) నినాదంతో ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర ఓట్ల జాబితా సవరణ

-మిగతా 3 లో



జనగణన వివరాలు బయటపెట్టొద్దు!

- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం కీలక ఆదేశాలు
- 2027 జనాభా లెక్కల డేటా గోప్యతకు అత్యంత ప్రాధాన్యం
- మీడియాకు సమాచారం, గణాంకాలు విడుదల చేయరాదని స్పష్టీకరణ
- 1948 జనగణన చట్టం ప్రకారం వివరాలకు రక్షణ
- జనగణన రికార్డుల తనిఖీకి అనుమతి లేదన్న ఆర్‌జీఐ
- పూర్తిగా డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ
- మొబైల్ యాప్‌ల ద్వారా కేంద్ర సర్వర్‌కు సమాచారం
- నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో కాగితపు పత్రాల వినియోగం

మలేరియా టీకా ధర భారీగా తగ్గింపు.

- వ్యాక్సిన్ ధరను 40 శాతం తగ్గించేందుకు భారత్ బయోటెక్ ఒప్పందం
- గవి, యునిసెఫ్ సంస్థలతో కీలక భాగస్వామ్యం
- డోసు ధర 9.30 యూరోల నుంచి 5.50 యూరోలకు తగ్గింపు
- 2027 ప్రారంభం నుంచి కొత్త ధరలు అమల్లోకి వచ్చే అవకాశం





ప్రయాణాల్లో తెలంగాణ టాప్

- మహాలక్ష్మి పథకంతో పెరిగిన మహిళల రాకపోకలు
- మహిళా సాధికారతకు ప్రభుత్వ చర్యలే నిదర్శనం: సీఎం
- 2019లో 43.7 శాతం.. 2024లో 54.6 శాతానికి పెరుగుదల
- ఐదేళ్లలో 10.9 శాతం పాయింట్ల వృద్ధి నమోదు
- జాతీయ గణాంక కార్యాలయం సర్వేలో వెల్లడి
- తమిళనాడు, కర్ణాటక, పంజాబ్ కంటే తెలంగాణలో అధిక వృద్ధి
- రోజుకు 37 లక్షల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు మహాలక్ష్మి ఊతం

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి అక్టోబర్ 26 మహాప్రభ

తెలంగాణలో మహిళల ప్రయాణాలు గణనీయంగా పెరుగుతున్నాయని, మహిళా సాధికారత దిశగా తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలకు ఇదే నిదర్శనమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం కింద అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం మహిళలకు ఆర్థిక భరోసాతోపాటు స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశాన్ని కల్పిస్తోందని తెలిపారు. మహిళల ఆత్మగౌరవం, స్వయం ప్రతిపత్తిని పెంపొందించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. జాతీయ గణాంక కార్యాలయం నిర్వహించిన అఖిల భారత కాల వినియోగ సర్వే ప్రకారం తెలంగాణలో 15 నుంచి 59 ఏళ్ల వయసున్న మహిళల రోజువారీ

-మిగతా 3 లో

పల్లెగుట్ట అనంతగిరి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

-స్వామివారి దర్శనం.. ఆలయ సేవకు మందడి సరోజ్ రెడ్డి హామీ





దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 26 మహాప్రభ
చిన్నచింతకుంట: ఆధ్యాత్మిక సేవకు అండగా నిలుస్తూ, ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందించేందుకు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, హైకోర్టు న్యాయవాది మందడి సరోజ్ రెడ్డి ముందుకొచ్చారు. మండల కేంద్రంలోని పల్లెగుట్ట అనంతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళంగా అందజేస్తానని హామీ ఇచ్చారు.
ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి సహకరించడం తనకు సంతోషకరమని పేర్కొన్నారు. తొలిసారి ఆలయాన్ని సందర్శించిన సందర్భంలోనే అభివృద్ధి కోసం రూ.1,00,000 అందిస్తానని ప్రకటించడం పట్ల ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మందడి సరోజ్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా, ఆలయ అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

మందడి సరోజ్ రెడ్డి మాట్లాడుతూ..
స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెద్దవంగర, అక్టోబర్ 26: (మహాప్రభ)
మండలంలోని బీసీ తండా, పోచంపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు ప్రారంభించారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేందుకు, ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ఈ కేంద్రాలు దోహదపడతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మహబూబ్ పాషా, సీసీలు సుజాత, ఉమారాణి, సుధాకర్, ఆపరేటర్ అనిల్‌తో పాటు ఆయా గ్రామాల సమాఖ్య, వీవోఏల ప్రతినిధులు, అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరో విజయమే లక్ష్యం.. ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి

-బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి దిశానిర్దేశం



దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 26 మహాప్రభ
అన్నాసాగర్: హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి విజయం సాధించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పట్టభద్రుల ఓటరు నమోదు అత్యంత కీలకమని, పార్టీ నాయకులు, కార్యకర్తలు రానున్న పది రోజులపాటు ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామంలో ఆల వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి హాజరయ్యారు. భూత్పూర్ మండల, పట్టణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఎన్నికల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు చేయించాలి
ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ముందుగా పార్టీకి చెందిన పట్టభద్రులైన నాయకులు, కార్యకర్తలు వెంటనే తమ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో ఓటు నమోదు చేసుకోని పట్టభద్రులను గుర్తించి, వారందరితో నమోదు ప్రక్రియ పూర్తి చేయించాలని స్పష్టం చేశారు.
గతంలో ఓటు నమోదు చేసుకున్నవారు సైతం ప్రస్తుత ఎన్నికల ప్రక్రియకు అనుగుణంగా మరోసారి నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. పట్టభద్రులను ఫోన్ ద్వారా సంప్రదించి, ఓటు నమోదు ఆవశ్యకతను వివరించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి నాయకుడు, కార్యకర్త తమకు పరిచయమున్న పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదులో చొరవ చూపాలని కోరారు.

సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలి
గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించిందని ఆల వెంకటేశ్వర్ రెడ్డి గుర్తుచేశారు. సిట్టింగ్ స్థానాన్ని మరోసారి కైవసం చేసుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేవరకద్ర నియోజకవర్గంలో దాదాపు 11 వేల మంది పట్టభద్రులు ఉన్నారని, ప్రతి ఒక్కరినీ చేరుకోవడంపై పార్టీ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.
అధికారం కోల్పోయినప్పటికీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించామని పేర్కొంటూ, అదే పట్టుదల, ఐక్యత, సమన్వయంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ముందుకు సాగాలని అన్నారు. ఎన్నికలను తేలిగ్గా తీసుకోకుండా, ఓటరు నమోదు నుంచి ప్రచారం వరకు ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదును ఉద్యమంలా చేపట్టి, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యలపై కలంతో పోరాడుతూనే.. జర్నలిస్టుల సంక్షేమానికి అండగా

-ఐదోసారి రామాయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా బసన్నపల్లి మల్లేశం

-18 ఏళ్ల జర్నలిజం ప్రస్థానం.. ఎనిమిదేళ్లుగా నాయకత్వ బాధ్యతలు





రామాయంపేట అక్టోబర్ 26 మహాప్రభ
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, బాధితుల పక్షాన నిలబడటం, జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేయడం అనే మూడు లక్ష్యాలతో తన వృత్తిపరమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు బసన్నపల్లి మల్లేశం. దాదాపు 18 ఏళ్లుగా జర్నలిస్టుగా కొనసాగుతున్న ఆయన, రామాయంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికై మరోసారి తన నాయకత్వాన్ని చాటుకున్నారు. ఎనిమిదేళ్లుగా ప్రెస్ క్లబ్ బాధ్యతల్లో కొనసాగుతూ సహచర జర్నలిస్టులతో సమన్వయం, వారి సమస్యలపై స్పందన ఆయన ప్రస్థానంలో ప్రత్యేకత.

అక్షరాలతో ప్రజా సమస్యలపై పోరాటం
జర్నలిజాన్ని కేవలం వార్తల ప్రచురణకే పరిమితం చేయకుండా ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే సాధనంగా మల్లేశం ఉపయోగిస్తున్నారు. నవతెలంగాణ దినపత్రిక రామాయంపేట మండల విలేకరిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, ప్రజా సమస్యలు, స్థానిక అభివృద్ధి, ప్రభుత్వ శాఖల పనితీరు, సామాన్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వార్తల రూపంలో వెలుగులోకి తెస్తున్నారు.

ఐదోసారి బాధ్యతలు.. సహచరుల నమ్మకానికి ప్రతిబింబం
ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఐదోసారి బాధ్యతలు చేపట్టడం సహచర జర్నలిస్టుల విశ్వాసానికి నిదర్శనం. పదవి కంటే బాధ్యతకే ప్రాధాన్యమిస్తూ జర్నలిస్టుల మధ్య ఐక్యత, పరస్పర సహకారం, సంఘ బలోపేతానికి కృషి చేస్తున్నారు.
ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిస్టులు ఆరోగ్య భద్రత, ఆర్థిక ఇబ్బందులు, ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణ సదుపాయాలు, వృత్తిపరమైన భద్రత వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు వంటి సంక్షేమ సదుపాయాలు కల్పించాలనే డిమాండ్లు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.
భవిష్యత్తులో మరింత క్రియాశీలకంగా,మారుతున్న మీడియా రంగంలో డిజిటల్ విస్తరణతో జర్నలిస్టుల బాధ్యతలు, సవాళ్లు పెరుగుతున్నాయి. వృత్తి విలువలను కాపాడుతూ, ప్రజా సమస్యలకు ప్రాధాన్యమిచ్చే జర్నలిజాన్ని ప్రోత్సహిస్తూనే, జర్నలిస్టుల సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత ప్రెస్ క్లబ్‌పై ఉంది. 18 ఏళ్ల వృత్తిపరమైన అనుభవం, ఎనిమిదేళ్ల నాయకత్వ ప్రస్థానం, ఐదోసారి అధ్యక్ష బాధ్యతలు.. ఇవన్నీ బసన్నపల్లి మల్లేశం ప్రయాణంలో కీలక మైలురాళ్లుగా నిలుస్తున్నాయి.

రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా జీఎంఆర్ కీలక అడుగు







-అడ్డాకులలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

-దళారుల బారిన పడకుండా మద్దతు ధర పొందాలి: ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 26 మహాప్రభ
అడ్డాకుల: రైతులు పండించిన పత్తికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర లభించేలా, వారి ప్రయోజనాలను పరిరక్షించడమే లక్ష్యంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) కీలక చర్యకు శ్రీకారం చుట్టారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా, నేరుగా భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని ఆయన పిలుపునిచ్చారు. అడ్డాకుల మండల కేంద్రంలోని ఎస్ఎస్వీ కాటన్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే జీఎంఆర్ స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి క్వింటాల్‌కు రూ.8,667 చొప్పున ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరను పొందాలని సూచించారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే జీఎంఆర్ స్పష్టం చేశారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు న్యాయమైన ధర లభించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. పత్తి విక్రయాల సమయంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని, ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం కొనుగోళ్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

దళారులను ఆశ్రయించొద్దు.. మద్దతు ధరను సద్వినియోగం చేసుకోండి
పత్తి రైతులు తొందరపడి దళారులకు తక్కువ ధరకు పంటను విక్రయించి నష్టపోవద్దని జీఎంఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని, నిబంధనల ప్రకారం పత్తిని నేరుగా సీసీఐకి విక్రయించాలని సూచించారు. తద్వారా రైతులకు మద్దతు ధర లభించడంతో పాటు వారి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుందని పేర్కొన్నారు.
రైతులకు భరోసా కల్పిస్తూ, పంటకు గిట్టుబాటు ధర అందేలా కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే జీఎంఆర్ సూచించారు. రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ, వారికి అండగా నిలవడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

ధర్మం, సత్యం, మానవతకు ప్రతీక వాల్మీకి మహర్షి

దేవరకద్రలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు.. అజిలాపూర్‌లో ప్రత్యేక పూజలు, అన్నదానం





దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 26 మహాప్రభ
దేవరకద్ర: ఆదికవి వాల్మీకి మహర్షి రచించిన రామాయణం యుగయుగాలుగా మానవాళికి ధర్మం, సత్యం, నీతి, మానవతా విలువలను బోధిస్తోందని దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి అన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని దేవరకద్ర పట్టణంతో పాటు మండలంలోని అజిలాపూర్ గ్రామంలో సోమవారం వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

రామాయణం మానవాళికి మార్గదర్శకం
దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన జయంతి వేడుకలకు మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ఓబీసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకుడు జట్టి నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆదికవి వాల్మీకి మహర్షి భగవాన్ శ్రీరాముడి దివ్య చరిత్రను రామాయణ మహాకావ్యంగా రచించి ప్రపంచ సాహిత్యానికి అమూల్యమైన సంపదను అందించారని కొనియాడారు. శ్రీరాముడి ఆదర్శ జీవితం ద్వారా ధర్మబద్ధమైన పాలన, కుటుంబ విలువలు, ప్రజల పట్ల బాధ్యత, సత్యనిష్ఠ వంటి ఉన్నతమైన సందేశాలను మానవాళికి అందించారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలో సోదరభావం, ఐక్యత, మానవత్వాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం అధ్యక్షుడు హరికృష్ణ, ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్, శ్రీకాంత్, డాక్టర్ రాజు, ప్రశాంత్ కుమార్, డీజే శివ, రాము, విజయ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు చంద్రయ్య శెట్టి, చెన్నారెడ్డి, కౌన్సిలర్ బీరప్ప, బీఆర్ఎస్ నాయకుడు మున్నూరు బాలరాజు, ముదిరాజ్ సంఘం నాయకులు బుచ్చన్న, నరేష్, రజక సంఘం నాయకుడు ఎల్బీ మైబు తదితరులు పాల్గొన్నారు

.అజిలాపూర్‌లో పూజలు.. అన్నదానం
దేవరకద్ర మండలం అజిలాపూర్ గ్రామంలోనూ వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో స్మరించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు, గ్రామస్థులు పాల్గొని మహర్షికి నివాళులర్పించారు.
ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు కావలి దిలీప్, మండ్ల ఆంజనేయులు, బాలయ్య, ఆశన్న, కేహెచ్‌బీ బాలయ్య, చంద్రశేఖర్, కావలి బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

రక్షణ రంగానికి రూ.2.12 లక్షల కోట్ల బలం!

-భారీ సైనిక కొనుగోళ్లకు రక్షణ కొనుగోళ్ల మండలి ఆమోదం
-రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన కీలక నిర్ణయం
-82 శాతం కొనుగోళ్లు దేశీయ పరిశ్రమల నుంచే
-సైన్యానికి అత్యాధునిక హెలికాప్టర్లు, కామికాజ్ డ్రోన్లు
-నౌకాదళం, వాయుసేన సామర్థ్యం పెంపునకు ప్రాధాన్యం



న్యూఢిల్లీ: దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. త్రివిధ దళాల ఆధునికీకరణ కోసం రూ.2.12 లక్షల కోట్ల విలువైన సైనిక ఆయుధాలు, పరికరాలు, యుద్ధ సామగ్రి కొనుగోలు ప్రతిపాదనలకు రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. సోమవారం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సైన్యం, నౌకాదళం, వాయుసేన అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక రక్షణ సామగ్రిని సమకూర్చేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. మొత్తం కొనుగోళ్లలో సుమారు 82 శాతం దేశీయ రక్షణ పరిశ్రమల నుంచే సేకరించాలని నిర్ణయించడం విశేషం. ఈ చర్యతో స్వదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీకి మరింత ప్రోత్సాహం లభించనుంది. దేశీయ పరిశ్రమల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రక్షణ పరికరాల కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదనలను రూపొందించారు. భారత సైన్యం కోసం తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లు, సుదూర లక్ష్యాలను ఛేదించగల కామికాజ్ డ్రోన్ వ్యవస్థలు, అత్యధిక చలన సామర్థ్యం కలిగిన వాహనాలను సమకూర్చనున్నారు. ఈ పరికరాలతో సైనిక దళాల నిఘా, రవాణా, దాడి సామర్థ్యాలు మరింత మెరుగుపడే అవకాశముంది. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో సైనిక కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. భారత నౌకాదళం కోసం శత్రు క్షిపణులను తప్పుదోవ పట్టించే యాక్టివ్ ఆఫ్ బోర్డ్ డికాయ్ వ్యవస్థను సమకూర్చనున్నారు. వాయుసేన అవసరాల కోసం నూతన హెలికాప్టర్ల కొనుగోలుకు ఆమోదం తెలిపారు. తాజా నిర్ణయంతో త్రివిధ దళాల యుద్ధ సన్నద్ధతను పెంచడంతో పాటు దేశీయ రక్షణ తయారీ రంగానికి ఊతం లభించనుంది. అయితే డీఏసీ ఆమోదం కొనుగోలు ప్రక్రియలో ఒక కీలక దశ మాత్రమే. తదుపరి ప్రక్రియలు పూర్తయిన తర్వాతే తుది ఒప్పందాలు కుదరనున్నాయి.

సిరీస్ వేటలో శ్రేయస్ సేన..

-నేడు న్యూజిలాండ్‌తో మూడో టీ20
- 2-0 ఆధిక్యంతో జోరుమీదున్న టీమిండియా
- గాయంతో ఇషాన్ కిషన్ దూరం.. వైభవ్ సూర్యవంశీకి మరో ఛాన్స్
- హైదరాబాదీ తిలక్ వర్మ, నితీశ్ రెడ్డిపై భారీ ఆశలు
- బౌలింగ్‌లో పుంజుకోవాల్సిన భువనేశ్వర్ కుమార్
- గాయాలతో కివీస్‌కు ఎదురుదెబ్బ.. హెన్రీ, ఫెర్గుసన్ దూరం
- బౌలర్లు, ఫీల్డర్లకు సవాల్‌గా వెల్లింగ్టన్ ఈదురుగాలులు
- మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రసారం



వెల్లింగ్టన్, స్పోర్ట్స్ డెస్క్

న్యూజిలాండ్ గడ్డపై వరుస విజయాలతో దూసుకెళ్తున్న భారత జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇప్పటికే 2-0 ఆధిక్యంలో ఉన్న శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీమిండియా మూడో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. మంగళవారం వెల్లింగ్టన్ వేదికగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడో టీ20 జరగనుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో అద్భుత ప్రదర్శనతో విజయాలు అందుకున్న భారత జట్టు అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. మరోవైపు వరుస పరాజయాలతో ఒత్తిడిలో ఉన్న ఆతిథ్య న్యూజిలాండ్‌కు ఈ మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. మూడో టీ20లోనూ ఓడితే మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్‌ను కోల్పోవాల్సి వస్తుంది. దీంతో ఎలాగైనా గెలిచి సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలని కివీస్ పట్టుదలతో ఉంది. అయితే కీలక మ్యాచ్‌కు ముందు భారత జట్టుకు ఇషాన్ కిషన్ గాయం రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. తొడకండరాల గాయంతో బాధపడుతున్న ఇషాన్ మూడో టీ20కు కూడా దూరమయ్యాడు. తొలి మ్యాచ్‌లో గాయపడిన అతడిని రెండో టీ20లో ఆడించని జట్టు యాజమాన్యం.. పూర్తిగా కోలుకోకపోవడంతో మూడో మ్యాచ్‌కూ విశ్రాంతినిచ్చింది. దీంతో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం దక్కనుంది. రెండో టీ20లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన వైభవ్ ఈసారి తన ప్రతిభను నిరూపించుకోవాలని భావిస్తున్నాడు. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజు శాంసన్ మరోసారి శుభారంభం అందించేందుకు సిద్ధమయ్యారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మిడిలార్డర్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ముఖ్యంగా హైదరాబాదీ యువ బ్యాటర్ తిలక్ వర్మపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రెండో టీ20లో అజేయ అర్ధసెంచరీతో జట్టును విజయతీరాలకు చేర్చిన తిలక్ అదే ఫామ్‌ను కొనసాగించాలని చూస్తున్నాడు. మరో తెలుగు యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కూడా గత మ్యాచ్‌లో కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. వీరిద్దరూ మరోసారి రాణిస్తే భారత బ్యాటింగ్ మరింత బలపడనుంది. నమన్ ధీర్, అక్షర్ పటేల్ రూపంలో జట్టుకు అదనపు బ్యాటింగ్ బలం ఉంది. అయితే బౌలింగ్ విభాగంలో స్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్ పుంజుకోవాల్సిన అవసరం ఉంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో భారీగా పరుగులు సమర్పించుకున్న అతడు వికెట్లు సాధించడంలోనూ విఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌లో భువనేశ్వర్‌తోపాటు అర్ష్‌దీప్ సింగ్, ఇతర బౌలర్లు సమష్టిగా రాణించాల్సి ఉంది. మరోవైపు న్యూజిలాండ్ జట్టును గాయాల సమస్య వేధిస్తోంది. ప్రధాన పేసర్లు మాట్ హెన్రీ, లోకీ ఫెర్గుసన్ గాయాలతో మూడో టీ20కు దూరమయ్యారు. వీరి స్థానాల్లో బ్లెయిర్ టిక్నర్, కైల్ జేమీసన్‌లను జట్టులోకి తీసుకున్నారు. దీంతో ఆతిథ్య జట్టు బౌలింగ్ విభాగంలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇక వెల్లింగ్టన్‌లో వీచే బలమైన ఈదురుగాలులు ఇరు జట్లకు మరో సవాల్‌గా మారనున్నాయి. ముఖ్యంగా బౌలింగ్ సమయంలో బంతి నియంత్రణ, ఫీల్డింగ్‌లో క్యాచ్‌లు అందుకోవడంపై గాలుల ప్రభావం పడే అవకాశముంది. ఈ పరిస్థితులకు త్వరగా అలవాటు పడే జట్టుకే మ్యాచ్‌లో పైచేయి సాధించే అవకాశం ఉంటుంది. బ్యాటింగ్‌కు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడితే భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశమూ ఉంది. మొత్తంగా సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో భారత్, పరువు నిలబెట్టుకోవాలనే పట్టుదలతో న్యూజిలాండ్ బరిలోకి దిగుతుండటంతో మూడో టీ20పై ఆసక్తి నెలకొంది.

అంచనా తుది జట్లు:

భారత్: అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), వైభవ్ సూర్యవంశీ, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి/ప్రిన్స్ యాదవ్.

న్యూజిలాండ్: ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్ (వికెట్ కీపర్), డెవాన్ కాన్వే/జేపన్ జాకబ్స్, గ్లెన్ ఫిలిప్స్, డారిల్ మిచెల్, మైకేల్ బ్రేస్‌వెల్, మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), కైల్ జేమీసన్, ఆడమ్ మిల్నే, జాకబ్ డఫీ, బ్లెయిర్ టిక్నర్.

తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర సానుకూలం!

మొదటి తరువాయి

నేతృత్వంలో సంయుక్త అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ముంబైలోని సహ్యాద్రి ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చారిత్రకంగా, సాంస్కృతికంగా గొప్ప ప్రాంతమైనప్పటికీ అభివృద్ధిలో వెనుకబడిపోయిందన్నారు. గిరిజనులు, ఆదివాసీలకు సాగునీరు, తాగునీరు అందించాల్సిన అవసరాన్ని వివరించారు. 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్‌బీ చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి ఇప్పటివరకు జరిగిన ప్రయత్నాలను ప్రస్తావించారు. 2016లో బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయించినప్పటికీ ఆ ఎత్తుతో తెలంగాణ నీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని తెలిపారు. విద్యుత్ వ్యయం, నిర్వహణ ఖర్చులు, పర్యావరణ పరిరక్షణను పరిగణనలోకి తీసుకుంటే 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మాణమే ప్రయోజనకరమని వివరించారు. గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తుమ్మిడిహెట్టి కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, తెలంగాణ, మహారాష్ట్ర మధ్య అభివృద్ధి వారధిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తుచేస్తూ ఆదిలాబాద్ గిరిజనుల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయం అందుబాటులోకి వస్తే రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా, ఆర్థిక కార్యకలాపాలు మెరుగుపడతాయని వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు ఆ రాష్ట్ర నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. మహారాష్ట్ర ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని తేలితే 148 మీటర్ల ఎత్తుకు సంబంధించిన పాత ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో అవసరమైన సాంకేతిక అధ్యయనాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈలోగా రెండు రాష్ట్రాల అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు భూముల విస్తీర్ణం, పరిహారం, ప్రత్యామ్నాయాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని సూచించారు. తదుపరి సమావేశాల కాలపరిమితిని నిర్ణయించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రతిపాదించారు. వెనుకబడిన ప్రాంతాలు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధికి పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఇరువురు ముఖ్యమంత్రులు అభిప్రాయపడ్డారు.

ట్రంప్ ఆదేశిస్తే 96 గంటల్లో ఇరాన్‌పై దాడులు!

న్యూయార్క్:

పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలు జారీ చేస్తే కేవలం 96 గంటల్లోనే ఇరాన్‌పై సైనిక దాడులు ప్రారంభించేందుకు అమెరికా బలగాలు సిద్ధంగా ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇరాన్‌లోని కీలక సైనిక స్థావరాలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలు, రాడార్ వ్యవస్థలు, అణు కేంద్రాలతోపాటు ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకునేలా అమెరికా సైనిక వ్యూహాలను రూపొందించినట్లు సమాచారం. పశ్చిమాసియాలో ఇప్పటికే పెద్ద సంఖ్యలో అమెరికా బలగాలను మోహరించామని ఇద్దరు అధికారులు సీఎన్ఎన్‌కు వెల్లడించినట్లు కథనం పేర్కొంది. అయితే దాడులు ప్రారంభించాలా, వద్దా అనే తుది నిర్ణయం పూర్తిగా అధ్యక్షుడు ట్రంప్ చేతుల్లోనే ఉందని వారు స్పష్టం చేసినట్లు తెలిపింది. అమెరికా సైన్యం ఇరాన్‌పై విస్తృత స్థాయిలో దాడులు నిర్వహించేందుకు అవసరమైన సన్నాహాలు చేస్తున్నట్లు ఆ కథనం వెల్లడించింది. గతంలో మాదిరిగా కొన్ని పరిమిత లక్ష్యాలకే కాకుండా ఈసారి ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని



ప్రభావితం చేసే పలు కీలక కేంద్రాలను లక్ష్యంగా చేసుకునే అవకాశముందని పేర్కొంది. ముఖ్యంగా రాడార్ వ్యవస్థలు, క్షిపణి ప్రయోగ వేదికలు, సైనిక స్థావరాలు, అణు సంబంధిత కేంద్రాలపై దృష్టి సారించినట్లు తెలిపింది. ఇంధన మౌలిక సదుపాయాలు కూడా సంభావ్య లక్ష్యాల జాబితాలో ఉన్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్‌కు సంబంధించిన వివరాలను ఉటంకిస్తూ పేర్కొంది. అయితే సైనిక చర్యకు సంబంధించి అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటివరకు తుది ఆదేశాలు జారీ చేయలేదని అధికారులు వెల్లడించినట్లు సమాచారం. ఈ ఏడాది చివరిలోగా ఎప్పుడైనా ఆదేశాలు వచ్చే అవకాశం ఉందని, ముఖ్యంగా అమెరికా మధ్యంతర ఎన్నికల అనంతరం కీలక నిర్ణయం తీసుకునే అవకాశాలను తోసిపుచ్చలేమని వారు అభిప్రాయపడినట్లు కథనం తెలిపింది. ఎన్నికల తర్వాత అనుసరించాల్సిన సైనిక వ్యూహంపై ట్రంప్ ఇంకా స్పష్టమైన నిర్ణయానికి రాలేదని పేర్కొంది. మరోవైపు అమెరికా సైనిక కదలికలు, వ్యూహాలను ఇరాన్ దళాలు గమనిస్తున్నాయని అమెరికా అధికారులు అంగీకరించినట్లు కథనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో దాడుల ప్రణాళికలను మరింత విస్తృతంగా రూపొందిస్తున్నట్లు పెంటగాన్ వర్గాలను ఉటంకిస్తూ తెలిపింది. అయితే అమెరికా సైనిక సన్నద్ధతపై వెలువడిన ఈ వివరాలకు సంబంధించి వైట్‌హౌస్ అధికారికంగా స్పందించలేదు. ఇరాన్‌పై అమెరికా మరోసారి సైనిక చర్యకు దిగే అవకాశాలపై వస్తున్న కథనాలు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచుతున్నాయి. అయితే 96 గంటల్లో దాడులు ప్రారంభించగలమన్నది అధికారులను ఉటంకిస్తూ వెలువడిన నివేదికలోని అంశమే తప్ప, దాడులకు ట్రంప్ ఆదేశాలు ఇచ్చినట్లు అధికారిక ధ్రువీకరణ వెలువడలేదు.

హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర

మొదటి తరువాయి

(ఎన్‌బీఆర్)పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో, దేశంలో శాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానంగా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఓట్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి తనతో కలిసి రావాలని, అక్కడ ఓట్ల జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించారో పరిశీలిద్దామని అన్నారు. ఓట్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆధారాలున్న కనీసం పది మంది ఓట్ల వివరాలను చూపించాలని తెలంగాణ కాంగ్రెస్ మంత్రులను కోరారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను మళ్లీ చేర్చుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు.ఎన్‌బీఆర్‌లో 13 కోట్ల మంది ఓట్ల పేర్లు తొలగించారన్న ప్రతిపక్ష వాదనలో వాస్తవాలను పరిశీలించాలని రామచందర్‌రావు అన్నారు. ఆ సంఖ్యలో మరణించినవారు, చిరునామా మారినవారు, అందుబాటులో లేనివారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్నవారు ఉన్నారని పేర్కొన్నారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణలపై భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఓట్ల జాబితా సవరణపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, బీజేపీ ఆ ఆరోపణలను ఖండిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు పార్టీల కార్యక్రమాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రామచందర్‌రావు తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లడంపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రంలోని 600కు పైగా మండలాల్లో 300కుపైగా మండలాలకు కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, హైదరాబాద్‌లో రోజుకు సుమారు 8,000 వాటర్ ట్యాంకర్లకు బుకింగ్‌లు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

గ్రావిటీతో నీళ్లొస్తే రాజీనామా చేస్తా..

మొదటి తరువాయి

మాట్లాడారు. రాష్ట్రంలో కరువుకు కాంగ్రెస్ వైఫల్యమే కారణమని, 'ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు' అని పునరుద్ఘాటించారు. నీళ్లు కొనలేమని చెప్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, అందుబాటు లో ఉన్న నీటిని ఎందుకు ఎత్తిపోసి రైతులను ఎందుకు ఆదుకోవడం లేదని ప్రశ్నించారు. కృష్ణా, గోదావరి నీటికి ఎందుకు నిర్లక్ష్యంగా కిందికి వదిలేశారని నిలదీశారు.

ఏపీలో క్రాప్‌హాలిడే ఎందుకు లేదు?

ఇక్కడి ప్రభుత్వం అప్పనంగా వదిలేసిన నీళ్లను ఏపీ సర్కార్ ఒడిసిపట్టి పంటలు పండించుకుంటున్నదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఏపీలోని పట్టిసీమ లిఫ్ట్ వంద రోజులు నీళ్లు ఎట్లా ఎత్తింది? దానిపై ఉన్న దేవాదుల ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎందుకు ఎత్తలేదు? అని ప్రశ్నించారు. 33శాతం లోటు వర్షపాతం ఉన్న ఏపీలో క్రాప్‌హాలిడే ఎందుకు లేదు.. 17శాతం మాత్రమే లోటు వర్షపాతం నమోదైన తెలంగాణలో ఎందుకు ఉన్నది? అని నిలదీశారు. దేవాదులను సక్రమంగా నడిపి ఉంటే వరంగల్ జిల్లా, కరీంనగర్ జిల్లాలోని కొంతభాగం సస్యశ్యామలంగా మారేదని హరీశ్‌రావు గుర్తుచేశారు. శ్రీశైలంలో నీరు అందుబాటులో ఉన్నప్పుడు 24/7 ఎత్తిపోసి పంటలను కాపాడేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో ఐదు మోటర్లకు గాను రెండింటినే ఎందుకు నడుపుతున్నారని, 12 గంటలు ఆన్, 12గంటలు ఆఫ్ ఎందుకు చేస్తున్నారని నిలదీశారు.

మేడిగడ్డకు మరమ్మతులు చేయండి

ప్రభుత్వం తక్షణమే మేడిగడ్డకు మరమ్మతులు చేపట్టి, కన్నెపల్లి పంపుహౌస్ మోటర్లను నడిపి నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తమ్మిడిహట్టి నుంచి నీటిని తీసుకొచ్చేందుకు రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తామని ప్రభుత్వం చెప్తున్నదని, అకడినుంచి సుందిళ్లకు నీటిని తరలించే ప్రతిపాదనలో ఆయకట్టు ఎంత ఉన్నదో వెల్లడించాలని కోరారు. ప్రాజెక్టు పూర్తయ్యేలోపు ఆ ఖర్చు రూ.30 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లకు చేరే అవకాశం ఉన్నదని అభిప్రాయపడ్డారు. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి తమకు అభ్యంతరం లేదని, అది ఆచరణసా ధ్యమో కాదో కాలమే నిర్ణయిస్తుందన్నారు.

ప్రయాణాల్లో తెలంగాణ టాప్

ప్రయాణాల్లో గణనీయమైన వృద్ధి నమోదైందని సీఎం వివరించారు. 2019లో రోజుకు కనీసం ఒక్కసారైనా ఇంటి నుంచి బయటకు ప్రయాణించే మహిళల శాతం 43.7గా ఉండగా, 2024 నాటికి 54.6 శాతానికి పెరిగిందన్నారు. ఐదేళ్ల వ్యవధిలో 10.9 శాతం పాయింట్ల పెరుగుదల నమోదైందని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలవుతున్న ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మహిళల ప్రయాణాల వృద్ధి అధికంగా ఉందని సీఎం తెలిపారు. తమిళనాడులో 6.7 శాతం పాయింట్లు, కర్ణాటకలో 5 శాతం పాయింట్లు, పంజాబ్‌లో 4.1 శాతం పాయింట్ల పెరుగుదల నమోదైనట్లు వివరించారు. తెలంగాణలో నమోదైన వృద్ధి మహిళల ప్రయాణ అవసరాలు, అవకాశాల్లో వచ్చిన మార్పును ప్రతిబింబిస్తోందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో రోజుకు సుమారు 37 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని ముఖ్యమంత్రి వెల్లడించారు. విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థినులు, ఉద్యోగినులు, ఉపాధి కోసం రాకపోకలు సాగించే మహిళలకు ఈ సదుపాయం ఉపయోగపడుతోందన్నారు. ప్రయాణ ఖర్చుల భారం తగ్గడంతో మహిళలు తమ అవసరాల కోసం మరింత స్వేచ్ఛగా ప్రయాణించగలుగుతున్నారని పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి తెలిపారు. మహాలక్ష్మి పథకం మహిళల రోజువారీ జీవితాల్లో సానుకూల మార్పులకు దోహదపడుతోందని, మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

జనగణన వివరాలు బయటపెట్టొద్దు!

న్యూఢిల్లీ, నేషనల్ డెస్క్

దేశవ్యాప్తంగా 2027 జనాభా లెక్కల సేకరణ సందర్భంగా ప్రజల నుంచి సేకరించే వ్యక్తిగత సమాచారం, గణాంకాల గోప్యత విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. జనగణన ప్రక్రియలో సేకరించిన వివరాలను మీడియాకు విడుదల చేయరాదని, అనుమతి లేకుండా ఇతర అవసరాలకు వినియోగించరాదని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) స్పష్టం చేసింది. ఈ మేరకు జనగణన కమిషనర్ మృత్యుంజయ కుమార్ నారాయణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. జనాభా లెక్కల సేకరణలో ప్రజలు అందించే సమాచారం అత్యంత గోప్యమైనదని, దాని రక్షణకు ప్రత్యేక చట్టపరమైన నిబంధనలు ఉన్నాయని తెలిపారు. 1948 జనగణన చట్టం ప్రకారం సేకరించిన వ్యక్తిగత వివరాలను బహిర్గతం చేయడానికి వీల్లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జనగణనకు సంబంధించిన వ్యక్తిగత రికార్డులను ఎవరూ తనిఖీ చేయడానికి అనుమతి ఉండదని, వాటిని న్యాయస్థానాల్లో సాక్ష్యాలుగా కూడా పరిగణించరాదని వివరించారు. జనగణన ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బంది సమాచార గోప్యతను కచ్చితంగా పాటించాలని సూచించారు. మరోవైపు 2027 జనాభా లెక్కల సేకరణను పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు తమ మొబైల్ ఫోన్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి కేంద్ర సర్వర్‌కు పంపించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు లేదా ఇంటర్నెట్ కనెక్టివిటీ అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల్లో కాగితపు షెడ్యూళ్ల ద్వారా సమాచారాన్ని సేకరించేందుకు అవకాశం కల్పించారు. డిజిటల్ విధానంతో సమాచార సేకరణ, నిర్వహణ ప్రక్రియను సులభతరం చేయాలని భావిస్తున్నట్లు వెల్లడించారు.

మలేరియా టీకా ధర భారీగా తగ్గింపు.

న్యూఢిల్లీ, నేషనల్ డెస్క్

మలేరియా మహమ్మారి నుంచి చిన్నారులను రక్షించడం కోసం భారత్ బయోటెక్ కంపెనీ కీలక ముందడుగు వేసింది. అంతర్జాతీయ సంస్థలు 'గవి ', 'యునిసెఫ్ తో కలిసి మలేరియా వ్యాక్సిన్ ధరను దాదాపు 40 శాతం తగ్గించేందుకు భారత్ బయోటెక్ ఒప్పందం కుదుర్చుకుంది. దాంతో ప్రస్తుతం ఒక్క డోసుకు 9.30 యూరోలుగా ఉన్న ధర 5.50 యూరోలకు తగ్గనుంది. భారత కరెన్సీ లో ఇది సుమారు రూ.600 లోపే ఉంటుంది.ఈ తగ్గింపు ధర 2027 ప్రారంభం నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో 2027-2029 మధ్య చిన్నారుల టీకా కార్యక్రమాలకు దాదాపు 50 మిలియన్ డాలర్లు ఆదా కానున్నాయి. ఈ నిధులతో మరో 10 లక్షల మంది పిల్లలకు మలేరియా వ్యాక్సిన్ అందించవచ్చని అంచనా. భారత్ బయోటెక్ ఈ వ్యాక్సిన్‌ను 'మాస్కివాక్' పేరుతో తయారు చేస్తున్నది. దీని అసలు పేరు ఆర్‌టీఎస్, ఎస్/ఏఎస్01. జీఎస్‌కే, పాత్ సంస్థలు, వాటి భాగస్వాములు ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశాయి. 2021లో ప్రపంచ ఆరోగ్య సంస్థ చిన్నారుల్లో మలేరియా నివారణ కోసం విస్తృత వినియోగానికి ఈ వ్యాక్సిన్‌ను సిఫారసు చేసింది. ప్రస్తుతం దీని తయారీ బాధ్యతలను జీఎస్‌కే నుంచి భారత్ బయోటెక్‌కు బదిలీచేసే ప్రక్రియ కొనసాగుతున్నది. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, మరిన్ని దేశాలకు వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకురావడం దీని ప్రధాన లక్ష్యం. ఈ వ్యాక్సిన్‌ను నాలుగు డోసుల కోర్సుగా ఇస్తారు. మలేరియా వ్యాప్తి క

ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు.. రైతు ఆవేదన!!



శివంపేట.అక్టోబర్, 26.(మహాప్రభ)

శివ్వంపేట మండలం గూడూరు గ్రామానికి చెందిన ఓ రైతు తన భూమి సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తనకు చెందిన సర్వే నంబర్ 146లోని 19 గుంటల భూమి ధరణి రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదైందని రైతు తెలిపాడు. ఈ సమస్యను పరిష్కరించి తనకు న్యాయం చేయాలని కోరుతూ ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు భూమి రికార్డుల్లో మార్పు జరగలేదని వాపోయాడు. తన భూమికి సంబంధించిన సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. భూమి రికార్డుల్లో నమోదైన వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని, సంబంధిత పత్రాలను తనిఖీ చేసి వాస్తవాలను నిర్ధారించాలని కోరాడు. తన భూమికి సంబంధించిన సమస్యపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు. ప్రజావాణిలో సమర్పించిన ఫిర్యాదుపై అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తే తనకు న్యాయం జరుగుతుందని రైతు ఆశాభావం వ్యక్తం చేశాడు. సంబంధిత రెవెన్యూ అధికారులు భూమి రికార్డులను పరిశీలించి, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని రైతు కోరుతున్నాడు.

రోడ్లు, డ్రైనేజీలపై డిజిటల్ నిఘా!

-11వ వార్డులో క్షేత్రస్థాయి సర్వే

-అభివృద్ధి పనులకు పక్కా ప్రణాళికే లక్ష్యం



దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 26 మహాప్రభ

దేవరకద్ర: పట్టణ మౌలిక సదుపాయాల స్థితిగతులను క్షేత్రస్థాయిలో అంచనా వేసి, భవిష్యత్తు అభివృద్ధి పనులకు పటిష్ఠ ప్రణాళికలు రూపొందించే దిశగా దేవరకద్ర మున్సిపాలిటీ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో రోడ్లు, డ్రైనేజీల ప్రస్తుత పరిస్థితిని గుర్తించేందుకు డిజిటల్ సర్వే నిర్వహించారు. ఈ సర్వే కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ వడే రాధా కొండల్, మున్సిపల్ చైర్‌పర్సన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డితో పాటు సంబంధిత మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. వార్డులోని రహదారులు, డ్రైనేజీల పరిస్థితులను డిజిటల్ విధానంలో నమోదు చేసి, క్షేత్రస్థాయి వివరాలను సేకరించడంపై సర్వేలో ప్రధానంగా దృష్టి సారించారు.

అభివృద్ధి పనులకు దిశానిర్దేశం

వార్డులో రోడ్ల పరిస్థితి, డ్రైనేజీ వ్యవస్థ పనితీరుపై సమగ్ర సమాచారం సేకరించడం ద్వారా అవసరమైన ప్రాంతాలను గుర్తించేందుకు ఈ సర్వే దోహదపడనుంది. సేకరించిన వివరాల ఆధారంగా భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రాధాన్య క్రమంలో ప్రణాళికలు రూపొందించేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. డిజిటల్ సర్వే ద్వారా వార్డులోని మౌలిక సదుపాయాలపై స్పష్టమైన సమాచారం అందుబాటులోకి రావడంతో, అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు మార్గం సుగమం కానుంది. ప్రజలకు మెరుగైన రహదారులు, సమర్థవంతమైన డ్రైనేజీ సదుపాయాలు కల్పించే దిశగా ఈ సర్వే కీలకంగా నిలవనుంది.

అనుమతులు లేని ఇసుక నిల్వ సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు



పాపన్నపేట, అక్టోబర్26(మహా ప్రభ)

పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సన్పల్లి గ్రామంలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా గ్రామంలోని మూడు వేరువేరు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుకను గుర్తించారు. సదరు ఇసుక నిల్వాలపై విచారణ నిర్వహించగా, ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ చేసినట్లు గుర్తించడంతో మొత్తం మూడు చోట్ల కల మొత్తం 19 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను గ్రామ జిపిఓ భూమయ్య సంబంధిత రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేశారు.

గాంధారి ఏటీఎం చోరీ ముఠా గుట్టురట్టు చేసిన కామారెడ్డి జిల్లా పోలీసులు.

కామారెడ్డి జిల్లా అక్టోబర్26(మహా ప్రభ)

గాంధారి ఏటీఎం దొంగతనం కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్ కు సదాశివనగర్ కానిస్టేబుల్ అజార్ ఫరూక్ కు జిల్లా ఎస్పీ అభినందనలతో పాటు జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర చేతుల మీదుగా క్యాష్ రివార్డు మరియు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కామారెడ్డి జిల్లా గాంధారి ఎస్బిఐ ఏటీఎంలో చోరీకి గురైన.అంతర్రాష్ట్ర ఏటీఎం చోరీ ముఠా గుట్టురట్టు -- రాజస్థాన్‌లో ప్రధాన నిందితుడిని పట్టుకున్న కామారెడ్డి పోలీసులు

- 5 ప్రత్యేక బృందాలతో దర్యాప్తు -- నగదు, స్కార్పియో వాహనం, గ్యాస్ కట్టింగ్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, మారణాయుధాలు స్వాధీనం.
- 5 రాష్ట్రాలు దాటి సాగిన పోలీసుల గాలింపు -- గాంధారి ఏటీఎం చోరీ కేసులో రాజస్థాన్‌కు చెందిన నిందితుడి పట్టివేత

నేరానికి నకిలీ నంబర్‌ప్లేట్లతో స్కార్పియో వాహనం వాడిన అంతర్రాష్ట్ర ముఠా ప్లాన్, వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పి శ్రీ యం. రాజేష్ చంద్ర ఐపిఎస్ గాంధారి గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ఎస్బిఐ ఎటిఎం వద్ద తేదీ 10/11-10-2026 నాడు అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నైటీలు ధరించి గ్యాస్ కట్టర్ సహాయంతో ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి, నగదుతో ఉన్న ఐదు బాక్సులను అపహరించారు. ఈ ఘటనలో మొత్తం రూ.25,45,900 నగదు చోరీకి గురైనట్లు సంబంధిత బ్యాంకు సంస్థ ప్రతినిధి ఫిర్యాదు చేయగా గాంధారి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 220/2026 గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను పట్టుకునేందుకు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఐదు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృందాలలో కామారెడ్డి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, పిట్లం ఎస్సై ఆంజనేయులు, సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్, ఇతర అధికారులతో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు. నేరం జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు నేరానికి ముందు రోజు నుండి సీసీటీవీ కెమరాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అనుమనితుల కదలికలు, వాహనం గుర్తింపు సమాచారంతో ఇతర రాష్ట్రాల పోలీసుల సమన్వయంచేసుకుంటూ గాలింపు చర్యలు తీవ్రతరం చేయడం జరిగింది. నేరం జరిగిన విధానం:పోలీసులు చేపట్టిన లోతైన దర్యాప్తులో నిందితుల ముందస్తు పక్కా ప్రణాళిక వెలుగులోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎటిఎం లను లక్ష్యంగా చేసుకుని వీరు చోరీలకు పాల్పడినట్లు తేలింది. ఈ నేరాల కోసం నల్లరంగు మహీంద్రా స్కార్పియో వాహనాన్ని



వాడుతూ, పోలీసుల కళ్లుగప్పేందుకు అసలు రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లకు బదులుగా ఇతర వాహనాల నంబర్ గల ప్లేట్లను మారుస్తూ వారి ప్రయాణం కొన సాగించారు. సెప్టెంబర్ 2026లో కరీంనగర్ ప్రాంతంలోని రెండు ఎస్‌బీఐ ఏటీఎంల వద్ద గ్యాస్ కట్టర్ సహాయంతో చోరీలకు పాల్పడినట్లు విచారణ ద్వారా తెలిసింది. 10-10-2026 రాత్రి నిందితులు మరోసారి తెలంగాణకు వచ్చి ఏటీఎంలను పరిశీలించారు. గాంధారి గ్రామానికి వచ్చే మార్గంలో ఒక వెల్డింగ్ షాప్ తాళం పగలగొట్టి ఆక్సిజన్ సిలిండర్‌తో పాటు నేరానికి ఉపయోగపడు సంబంధిత పరికరాలను దొంగిలించారు. అనంతరం గాంధారి ప్రధాన రహదారిపై ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు చేరుకుని వారిని గుర్తుపట్టకుండా ఉండేడుకు మాస్కులు, క్యాప్‌లు, నైటీలు ధరించి ముడుగా ఎటిఎం నందు ఉన్న సీసీటీవీ కేమరాలు పని చేయకుండా వాటిపై నలుపు స్ప్రే వాడి గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి, నగదుతో ఉన్న ఐదు బాక్సులను స్కార్పియో వాహనంలో వేసుకుని పరారైనట్లు దర్యాప్తులో వెల్లడైంది.

రాజస్థాన్ పోలీసులతో సమన్వయంతో

చోరీ విషయం తెలిసిన వెంటనే జిల్లా పోలీసులు రంగంలోకిదిగి ముందుగా నేరస్తులు వాడిన వాహనం స్కార్పియో గా గుర్తించి చోరీ అనంతరం అట్టి నిందితులు వాహనంలో మన రాష్ట్రం దాటి పరారయ్యారు అని మహారాష్ట్ర, రాజస్థాన్ వైపు వెళు న్నట్లు గుర్తించిన కామారెడ్డి పోలీసులు సంబంధిత రాష్ట్ర పోలీసులకు సమాచారం అందించారు. చివరికి రాజస్థాన్‌లోని చేచాట్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టి, బారికేడ్లు, రోడ్డు నిరోధక పరికరాల సహాయంతో వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వాహనం ఎడమవైపు టైరు దెబ్బతినడంతో నిందితులు కొంతదూరం వెళ్లి వాహనాన్ని వదిలిపెట్టి, నగదు ఉన్న బ్యాగుతో సహా పరారైనట్లు దర్యాప్తులో వెల్లడైంది.రాజస్థాన్‌లో నిందితుడి అరెస్టుప్రత్యేక బృందాలు ముందుగా రాజస్థాన్ చేరుకొని నిందితులు ఆచూకీ కోసం పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగించాయి. ఈ క్రమంలో 20-10-2026 సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో రాజస్థాన్ రాష్ట్రంలోని బరోడామేవ్ సమీపంలో భరత్‌పూర్ రోడ్డుపై బస్సు కోసం వేచి ఉన్న రషీద్‌ను కామారెడ్డి పోలీస్ బృందాలు బృందం గుర్తించి అదుపులోకి తీసుకుంది. అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై కామారెడ్డి తీసుక రావడం జరిగింది. తేదీ 21-10-2026న రాజస్థాన్‌లోని చేచాట్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న నల్లరంగు మహీంద్రా స్కార్పియో వాహనాన్ని గుర్తించి, అందులో ఉన్న గ్యాస్ కట్టింగ్ పరికరాలు, ఇతర పనిముట్లు, సంబంధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వాహనం వెనుక సీటు కింద దాచిన రెండు కత్తులు, ఒక ఇనుప రాడ్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడి వివరాలు : రషీద్, తండ్రి హలాం, వయస్సు: 30 సం. లు, నివాసం రాజస్థాన్ రాష్ట్రం.

స్వాధీనం చేసుకున్న వస్తువులు

1. నగదు -- రూ.29,400.
2. మొబైల్ ఫోన్లు-2
3. నల్లరంగు మహీంద్రా స్కార్పియో వాహనం
4. గ్యాస్ కట్టింగ్ నాజిల్, ఆక్సిజన్ సిలిండర్‌కు సంబంధించిన పరికరాలు, రెగ్యులేటర్, చెక్ మీటర్, పైపులు, ఇతర పనిముట్లు.
5. ఇనుప రాడ్లు, స్క్రూడ్రైవర్, అడ్జస్టబుల్ పానా, హ్యాక్సా బ్లేడ్ తదితర పరికరాలు.
6. వివిధ నంబర్లు గల నంబర్ ప్లేట్లు.
7. మాస్కులు, దుస్తులు, వీల్ రిమ్ తదితర వస్తువులు. 3-ఇనుప కత్తులు, 1-ఇనుప రాడ్.

నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచనున్న పోలీసులు ఈ కేసులో అరెస్టు చేసిన నిందితుడు రషీద్‌ను ఈ రోజు 26-10-2026న న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు మరియు ఈ కేసులో పరారీలో ఉన్న నిందితులను త్వరలో పట్టుకుంటామని జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, వెల్లడించారు. అంత రాష్ట్రం ఏటీఎం దొంగతనం ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, ఎస్సైలు ఆంజనేయులు, పుష్పరాజ్‌లతో పాటు ఐటీ కోర్ ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సీసీఎస్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, లక్ష్మీకాంత్, సదాశివనగర్ కానిస్టేబుల్ అజార్ లను జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. గాంధారి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు ఎల్నినోపై అవగాహన కల్పించాలి

-పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం కావాలి

-జిల్లా నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు వెంకటేష్ దిశానిర్దేశం

మహబూబాబాద్:(పెద్ద వంగర అక్టోబర్ 26 (మహాప్రభ)

వాతావరణ మార్పుల నేపథ్యంలో ఎల్నినో ప్రభావాలపై రైతులకు ముందస్తు సమాచారం అందించి, వ్యవసాయ రంగంలో ఎదురయ్యే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూక్యా ఉమమురళి నాయక్ పార్టీ శ్రేణులకు సూచించారు. అదే సమయంలో రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ఏఐసీసీ సభ్యుడు, పరిశీలకుడు వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులకు ఎన్నికల కార్యాచరణపై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా భూక్యా



ఉమమురళి నాయక్ మాట్లాడుతూ, ఎల్నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు వ్యవసాయంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పంటల సాగు, వ్యవసాయ నిర్వహణ, ముందస్తు జాగ్రత్తలకు సంబంధించిన సమాచారాన్ని గ్రామస్థాయిలో రైతులకు చేరవేయాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల్లో పార్టీ నాయకులు చురుకుగా పాల్గొనాలని కోరారు. అనంతరం ఏఐసీసీ సభ్యుడు, పరిశీలకుడు వెంకటేష్ మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించడం, ఓటర్లతో నిరంతరం సంప్రదింపులు జరపడం, పార్టీ నాయకులు మరియు కార్యకర్తల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మండల, గ్రామ స్థాయిల్లో బాధ్యతలను స్పష్టంగా కేటాయించి, ఎన్నికల ప్రచారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించుకోవాలని వెంకటేష్ సూచించారు. ప్రతి పట్టభద్రుడిని చేరుకొని కాంగ్రెస్ పార్టీ విధానాలను వివరించడంతో పాటు, ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులకు సహకరించాలని తెలిపారు. సమష్టి కృషి, నిరంతర ప్రజాసంపర్కం, సమర్థవంతమైన కార్యాచరణతోనే ఎన్నికల్లో ఆశించిన ఫలితాలను సాధించగలమని పేర్కొన్నారు.

రైతులకు సంబంధించిన అంశాలపై క్షేత్రస్థాయిలో చైతన్యం కల్పించడం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయానికి బాటలు వేయడం అనే రెండు ప్రధాన లక్ష్యాలతో నాయకులు పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో వ్యవహరిస్తూ, అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని నాయకత్వం సూచించింది.

బాలల రక్షణపై అవగాహన సదస్సు

మంథని, అక్టోబర్26(మహా ప్రభ)

విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు వారి భద్రతకు సంబంధించిన అంశాలను తెలియజేసే ఉద్దేశంతో నిర్వహించిన సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జెడ్పీ హెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంథని సీనియర్ సివిల్ జడ్జి మల్లాడి అపర్ణ విద్యార్థులకు పోక్సో చట్టం లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం బాలల హక్కులు, వారి రక్షణకు ఉన్న చట్టపరమైన నిబంధనలపై



అవగాహన కల్పించారు. బాలలు తమకు ఎదురయ్యే సమస్యలపై భయపడకుండా స్పందించాలని, అన్యాయం జరిగినప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాలల భద్రత, హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గీట్ల భరత్ రెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఘోత్తం రెడ్డి న్యాయవాదులు శశిభూషణ్ కాచే పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

నీటిని విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాలి



దేవరకొండ అక్టోబర్ 26(మహాప్రభ)

మైనంపల్లి గ్రామంలో సోమవారం స్థానిక సర్పంచ్ రాంసింగ్ నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎల్ నినో ప్రభావం– నివారణ చర్యలపై అవగాహన సదస్సు సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశానికి పాలక వర్గ సభ్యులు. లైన్ డిపార్ట్మెంట్ అధికారులు హాజరయ్యారు ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నీటిని.విద్యుత్ ను పొదుపుగా వాడుకోవాలి కోరారు అదేవిధంగా మంచి నీటి వినియోగం. విద్యుత్ వినియోగం పై అవగహన కల్పించారు .ఈసమావేశంలో ఉప సర్పంచ్ లాలూ నాయక్ . ఎ.ఇ.ఓ అభిలాష్.పంచాయతీ కార్యదర్శి అంబెడ్కర్. వార్డు సభ్యులు నాగరాజు. మాజీ ఉప సర్పంచ్ వెంకట్ .ఫీల్డ్ అసిస్టెంట్ అమరెందర్. ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి. అంగన్వాడీ టీచర్లు కమలమ్మ. లచ్చి. ఎ.ఎన్.ఎం. విద్యావతి తదితరులు ఉన్నారు

అల్పాహారం..ప్రారంభం



పాపన్నపేట అక్టోబర్ 26(మహాప్రభ)

పాపన్నపేట మండల వ్యాప్తంగా జూనియర్ కళాశాల, 10 జడ్పీ హెచ్ ఎస్, 42 ప్రాథమికొన్నత, 8 ప్రాథమిక పాఠశాలలో సోమవారం అల్పాహార పథకం ప్రారంభమైంది. విద్యార్థులకు ఇడ్లీ,సాంబారు వడ్డించారు. మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి పొద్చున్ పల్లి పాఠశాలలో పాల్గొన్నారు. ఈకార్యక్రమం లో కొత్తపల్లి సర్పంచ్ పద్మ జగన్,ఉపసర్పంచ్ రాము,ఏఏపీసీ చైర్మన్ చంద్రకళ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమరావతి,,ఉపాధ్యాయులు సిద్దయ్య,రాజశేఖర్,సిఆర్పి మహేశ్వరి,వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు,సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కిలో బియ్యం రూ.95 ధర తగ్గించాలి

-గంధం సుమన్ మాదిగ:(టి డి.ఆర్.పి.ఎస్.)



దేవరకొండ అక్టోబర్ 26 (మహాప్రభ)

కష్టం చేసిన డబ్బులన్నీ బియ్యం కొనడానికి అయిపోతున్నాయి పేద ప్రజలకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కిరాణా షాప్ లో కేజీ సన్న బియ్యం 95 రూపాయలకు అమ్ముతున్నారు. మధ్యతరగతి పేద కుటుంబాలు ప్రజలు బియ్యం ధరలు అమాంతంగా పెరగడంతో కొనలేకపోతున్నారు. కొన్ని కుటుంబంలో జనాభా ఎక్కువ ఉన్నవారు ఒకపూటకే కేజీ బియ్యం అన్నం తింటున్నారు. చిన్న చిన్న ఫంక్షన్ లు పెళ్లిళ్లకు ఆర్థికంగా డబ్బులు లేక కేజీ బియ్యం 95 రూపాయలు ఉన్నవి దాదాపు 100 క్వింటల్ బియ్యం 10,000 రూపాయలు కొనాల్సిన పరిస్థితి ఏర్పడ్డది. రాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి సన్న బియ్యం ధర తగ్గించే విధంగా రైస్ మిల్లు గోదాములకు యాజమాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని పేద ప్రజలు కోసం తెలంగాణ దళిత రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపకులు అధ్యక్షులు గంధం సుమన్ మాదిగ కోరుచున్నారు

ఆది కవి మహర్షి వాల్మీకి జయంతి శుభాకాంక్షలు



దేవరకొండ అక్టోబర్ 26(మహాప్రభ)

శ్రీరాముడి దివ్య చరిత్రాన్ని సంస్కృతంలో మానవాళికి పరిచయం చేసిన ఆదికవి, బ్రహ్మర్షి మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ మన సనాతన ధర్మానికి, మానవ విలువలకు ప్రతీక అయిన రామాయణ కావ్యాన్ని అందించిన వాల్మీకి మహర్షి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన కోరారు

పాత బస్టాండ్ పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు!!

-ఎమ్మెల్యేమేఘారెడ్డి!!



వనపర్తి అక్టోబర్26 మహాప్రభ

వనపర్తి పట్టణంలోని పాత బస్టాండ్ పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు బస్టాండ్ లో ఉన్న మురికి కాలును అండర్ డ్రైనేజీగా మారుస్తామన్నారు బస్టాండ్ ఆవరణలో వ్యాపార సముదాలను ఏర్పాటు చేయిస్తామన్నారు ఈ బస్టాండు స్థలానికి సంబంధించిన రికార్డులను తీసుకురావాల్సిందిగా డిఎంకి సూచించారు .పాత బస్టాండ్ ను పూర్తిగా పునరుద్ధరించి సుందరీ కరణ చేసుకొని ప్రయాణికులకు ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు మున్సిపల్ చైర్మన్ మాధవి ఎస్ ఎల్ ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తిరుపతయ్య, జర్నల్ సెక్రెటరీ బ్రహ్మం చారి, పరుశురాం, కౌన్సిలర్లు వెంకటేష్, చుక్కరాజు, బి కృష్ణ, పాల రవి యాదగిరి, మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్, వనపర్తి డిఎం దేవేందర్ గౌడ్, కార్యాలయ సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

వనపర్తి జిల్లా ఎన్ఎస్యుఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం!

-పట్టణ పోలీస్ స్టేషన్‌లో పట్టభద్రులతో ఎమ్మెల్సీ ఓటు నమోదు!!



వనపర్తి అక్టోబర్ 26 మహాప్రభ

ఎన్ ఎస్ యు ఐ వనపర్తి జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ .. బొల్లి ఆధ్వర్యంలో చేపట్టిన పట్టభద్రుల ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్ లో అర్హులైన పట్టభద్రులైన పోలీస్ సిబ్బంది మరియు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయించనున్నారు.ఈ సందర్భంగా ఎన్ ఎస్ యు ఐ జిల్లా నాయకులు మాట్లాడుతూ... సమాజంలో శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూ బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న పోలీస్ సిబ్బంది కూడా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావడం అభినందనీయమని అన్నారు. పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును పొందేందుకు ముందుకు రావాలని కోరారు.

బండమీది తండా--శకృతండా ప్రధాన రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి: జటావత్ ప్రకాష్ నాయక్



దేవరకొండ అక్టోబర్ 26(మహాప్రభ)

నల్లగొండ: నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జటావత్ ప్రకాష్ నాయక్ పాల్గొని, గత మూడేళ్లుగా బండమీది తండా--శకృతండా ప్రధాన రహదారి పనులు అసంపూర్తిగా ఉండి, కేవలం కంకర రోడ్డుకే పరిమితమయ్యాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రహదారి పనులు పూర్తికాకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారి నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఫిర్యాదు ద్వారా కోరారు. ప్రజల సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాలి. రహదారి పనులు వెంటనే పూర్తి చేయకపోతే గ్రామ ప్రజల హక్కుల కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జటావత్ ప్రకాష్ నాయక్ హెచ్చరించారు.

ప్రజావాణిలో రెండు వినతులు



పాపన్నపేట, అక్టోబర్26(మహాప్రభ)

మండలం లోని కొడపాక గ్రామంలో విద్యుత్ స్తంభాలకు వైర్లు ఏర్పాటు చేయాలని,నాగ్సాన్‌పల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ రెండు దరఖాస్తులు అధికారులకు అందించారు. సోమవారం పాపన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి ప్రశాంతంగా సాగింది. ఎంపీడీవో విష్ణువర్ధన్,తహశీల్దార్ సతీష్‌కుమార్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో ఘోర ఆటో ప్రమాదం..









-ఏడుగురికి తీవ్ర గాయాలు

-108 అంబులెన్స్ సేవల్లో జాప్యంపై గ్రామస్థుల ఆరోపణలు..

-క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన స్థానిక యువకులు

ఎల్లారెడ్డి, అక్టోబర్ 26 (మహాప్రభ)

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు మరో ఆరుగురు గాయపడినట్లు సమాచారం. శ్రీ ఉమా సంగమేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలిసింది.

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ప్రమాదంలో ఆటో డ్రైవర్ చాంద్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు సమాచారం. ఆటోలో ప్రయాణిస్తున్న పాత శ్రీరామ్ (చంద్రయ్య కుమారుడు), అంకిత (శ్రీరామ్ భార్య), ముక్తార్, అంజుమ్ (ముక్తార్ భార్య), అల్ఫినా (ముక్తార్ కుమార్తె), ఆహిల్ (ముక్తార్ కుమారుడు) గాయపడినట్లు తెలిసింది. క్షతగాత్రులంతా కామారెడ్డి పట్టణానికి చెందినవారని సమాచారం.

ఆపదలో ఆదుకున్న స్థానిక యువకులు

ప్రమాదాన్ని గమనించిన స్థానిక యువకులు నీల సాయిబాబా, మామిడి అరుణ్, నిఖిల్, చాకలి సంగమేశ్వర్ వెంటనే స్పందించారు. క్షతగాత్రులకు త్వరగా వైద్యసహాయం అందించాలనే ఉద్దేశంతో ద్విచక్ర వాహనాలపై వారిని ఆసుపత్రికి తరలించేందుకు చొరవ చూపినట్లు సమాచారం. ఆపద సమయంలో మానవత్వంతో స్పందించి బాధితులకు సహాయం అందించిన యువకులను స్థానికులు అభినందించారు.

-108 అంబులెన్స్ సేవల్లో జాప్యంపై ఆరోపణలు

ప్రమాదం జరిగిన అనంతరం 108 అంబులెన్స్ సేవల కోసం ప్రయత్నించినప్పటికీ, అంబులెన్స్ అందుబాటులోకి రావడంలో దాదాపు రెండు గంటలకు పైగా జాప్యం జరిగిందని గ్రామస్థులు ఆరోపించారు. ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది. దీంతో క్షతగాత్రులకు వైద్యసాయం అందడంలో మరింత ఆలస్యం కాకుండా గ్రామస్థులే ప్రైవేట్ వాహనాలను ఏర్పాటు చేసి వారిని ఎల్లారెడ్డి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)కు తరలించినట్లు సమాచారం.

అధికారులు స్పందించాలని విజ్ఞప్తి

అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులకు సకాలంలో వైద్యసాయం అందించడం ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో 108 అంబులెన్స్ సేవల్లో జాప్యం జరిగిందన్న ఆరోపణలపై సంబంధిత అధికారులు వివరాలు పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అంబులెన్స్‌కు సమాచారం అందించిన సమయం, సేవలు అందుబాటులోకి రావడంలో జాప్యానికి గల కారణాలపై అధికారిక వివరాలు తెలియాల్సి ఉంది. క్షతగాత్రుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఓట్ బచావో.. దేశ్ బచావో

-నవంబర్ 1న ఢిల్లీకి పాదయాత్ర

-రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పిలుపు

సైబరాబాద్, (అక్టోబర్ 26) మహా ప్రభ

ఓటు హక్కును రక్షించుకోవడం, దేశాన్ని కాపాడుకోవడం కోసం నవంబర్ 1న ఢిల్లీలో జరగనున్న ప్రజా పాదయాత్ర, మహా ర్యాలీలో అందరూ పాల్గొనాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పిలుపునిచ్చింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు 'ఓట్ బచావో.. దేశ్ బచావో' ప్రచారంలో భాగంగా జిల్లా స్థాయి విలేకరుల సమావేశం, సంయుక్త సమన్వయ సమావేశం ఆదివారం జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ



అధ్యక్షురాలు శ్రీమతి పారిజాత నర్సింహా రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవంబర్ 1న ఢిల్లీ రాంలీలా మైదానంలో జరగనున్న నిరసనలో ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుడిలా పాల్గొనాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షురాలు పారిజాత నర్సింహా రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్ మోహన్ కుమార్ మంగళం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్ గౌడ్, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ మరబోయిన రఘునాథ్ యాదవ్,పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, చైర్మన్లు, శేరిలింగంపల్లి నియోజకవర్గ టీపీసీసీ, మాదాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్ నాయక్,డీసీసీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, డివిజన్, బ్లాక్ అధ్యక్షులు, మైనారిటీ, లేబర్ సెల్, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు. పాల్గొన్నారు.

సర్వీస్ అపార్ట్మెంట్లో వ్యభిచార దందా

-ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు మహిళలను రెస్క్యూ

-నిర్వాహకుడు నాయక్ పరారీ





మాదాపూర్, (అక్టోబర్ 26) మహా ప్రభ

మాదాపూర్‌లోని ఓరియన్ ఎలిగెంట్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో నడుస్తున్న వేశ్యావృత్తి కేంద్రంపై మాదాపూర్ పోలీసులు, కూకట్‌పల్లి ఎస్ఓటీ బృందం సంయుక్తంగా దాడి చేశాయి. ఈ దాడిలో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు విదేశీయ మహిళలను పోలీసులు రెస్క్యూ చేశారు. నిర్వాహకుడు నాయక్ పరారైపోయాడు. శనివారం రాత్రి 9 గంటలకు సర్వే ఆఫ్ ఇండియా కాలనీ, చంద్రనాయక్ తండాలోని ఓరియన్ ఎలిగెంట్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లోని 201వ ఫ్లాట్‌పై దాడి జరిగింది. వేశ్యావృత్తి కార్యకలాపాలు నడుస్తున్నాయని నమ్మదగిన సమాచారం అందడంతో పోలీసులు ఈ చర్యకు పాల్పడ్డారు. దాడి సమయంలో నిర్వాహకుడు నాయక్ తప్పించుకుపోయాడు. అతని వెంట పోలీసులు తీవ్రంగా అన్వేషణ చేస్తున్నారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో అతనిపై కేసు నమోదైంది. విచారణ కొనసాగుతోంది. రక్షించిన మహిళలు: రుస్తమోవా మఫ్‌తునా (26), నపసోవా గుజల్ (26), దావ్రనోవా మఖ్లియో (24). వీరంతా ఉజ్బెకిస్థాన్‌కు చెందినవారు. వీరిని గౌరవనీయ న్యాయస్థానం ముందు హాజరుపరిచి, తగిన ఆశ్రయం, పునరావాసం కల్పించేలా చర్యలు చేపట్టారు.

మాదాపూర్ పోలీసుల సూచన

సర్వీస్ అపార్ట్‌మెంట్ యజమానులు, నిర్వాహకులు తమ ప్రాంగణంలో ఉండే వ్యక్తుల గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని మాదాపూర్ పోలీసులు సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం



పాపన్నపేట, అక్టోబర్26(మహా ప్రభ)

మండల పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఉదయం అల్పాహారం పంపిణీ చేశారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన అల్పాహార పథకం కార్యక్రమాన్ని విద్యార్థులందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఉదయం ప్రతి ఒక్కరు పాఠశాలలో తినాలని ,ఆకలితో ఉండవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ గౌడ్, పాఠశాల చైర్మన్ భవాని, ప్రధానో పాధ్యాయులు మహేశ్వర్,మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్ ,మాజీ ఉప సర్పంచ్ ఖలీమ్ , ముశెట్టి కిష్టయ్య , శివయ్య ,సంగమేశ్వర్, శ్రీనివాస్ ,చోటు , రమేష్ ,ఉదయ్ , ప్రవీణ్ గౌడ్ , భూమయ్య ,పౌలు ,వినీష్ గౌడ్ హరీష్ ,శ్రీశైలం ,రాజు ,ఆంజనేయులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం శుభాకాంక్షలు



దేవరకొండ అక్టోబర్ 26(మహాప్రభ)

దేవరకొండ నూతన సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కరోలిన్ చింగ్ థియాన్ మావిని మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), దేవరకొండ ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం సబ్ కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. అనంతరం కళాశాలలో త్వరలో నిర్వహించనున్న 12వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావిని ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, ఎన్‌సీసీ అధికారి ఆర్. నాగేంద్ర, మధు తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్లో నీటిని, విద్యుత్‌ను ఆదా చేయాలి

-ఎల్ నినో సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కలెక్టర్ కీలక సూచనలు

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ జిల్లా -26అక్టోబర్ (మహాప్రభ).

కలెక్టరేట్లో నీటిని, విద్యుత్ ను ఉద్యోగులందరూ ఆదా చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్లోని ఈసమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ఎల్ నీ నో ప్రభావం వల్ల రానున్న రోజుల్లో త్రాగునీటికి, విద్యుత్ కి చాలా సమస్య వచ్చే ప్రమాదం ఉన్నందున అధికారులు, సిబ్బంది జిల్లా కార్యాలయాల్లో ఫ్యాన్లు, లైట్లు నిరంతరం వెలగకుండా చూసుకోవాలని, అవసరం ఉన్నంత మేరకే నీటిని వినియోగించాలని , నీటి సంరక్షణ చేసి,విద్యుత్ ను పొదుపు చేసినప్పుడే భవిష్యత్ తరాలకు అందించవచ్చు అని తెలిపారు.

మీ ప్రమాణం యాప్ లో తప్పక హాజరు నమోదు చేసుకోవాలి

కార్యాలయ ఉద్యోగుల కోసం తెచ్చిన నూతన యాప్ లో తప్పనిసరిగా కార్యాలయ ఉద్యోగులు హాజర నమోదు చేసుకోవాలని, హాజరు నమోదును కార్యాలయ జిల్లా అధికారులు పర్యవేక్షించాలన్నారు. వచ్చే శనివారం లోపు నీప్రమాణం యాప్ లో తప్పనిసరిగా నమోదు కావాలని అధికారుల ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్,డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ ని కలిసిన సిద్ధిపేట ఆత్మ చైర్మన్



సిద్ధిపేట అక్టోబర్ 27,(మహాప్రభ)

భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చమల కిరణ్ కుమార్ రెడ్డి నేడు సిద్ధిపేటలో మర్యాద పూర్వకంగా కలిసిన సిద్ధిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ. డి సి సి కార్యదర్శి మహిపాల్ రెడ్డి.జిల్లా మైనార్టీ అధ్యక్షుడు రసాత్. యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు వాహబ్. జిల్లా ఆత్మ కమిటీ డైరెక్టర్ లు జనార్దన్.అజ్మత్.పట్టణ అధ్యక్షుడు ఆతిఫ్.యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మల ప్రవీణ్.నాగరాజు.అశోక్.శ్రీనివాస్.వంశీ.తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



మెదక్ జిల్లా -26అక్టోబర్ (మహాప్రభ).

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ,అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలని, సమస్యకు సంబంధించిన వివరాలను నిర్ధారించుకుని నిబంధనల మేరకు పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో అనవసర జాప్యం చేయకుండా, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 69 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో భూ భారతి 26,ఇందిరమ్మ ఇండ్లు 07,పెన్షన్ 01,ఇతర 35 మొత్తం 69 అందాయన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తెలుగు పల్లి గ్రామంలో ఉపాధి హామీ ఆధ్వర్యంలో మొక్కల గుంతల తవ్వకం ప్రారంభం



దేవరకొండ అక్టోబర్ 26(మహాప్రభ)

తెలుగు పల్లి గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించే లక్ష్యంతో ఉపాధి హామీ పథకంలో భాగంగా మొక్కలు నాటడానికి అవసరమైన గుంతలు తీసే పనులను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ రమాదేవి రాములు లాంఛనంగా ప్రారంభించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో పర్యావరణ పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాన్ని హరిత వనంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ , గ్రామ ప్రముఖులు చాట్ల శంకర్, నారిమల అంజయ్య, వినోద్, దగ్గు రాములు మరియు ఉపాధి హామీ సిబ్బంది తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నల్గొండలో ప్రశాంతంగా ముగిసిన (టీ జి పి ఎస్ సీ) పరీక్షలు

- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

- నవంబర్ పరీక్షలకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం



దేవరకొండ అక్టోబర్ 26(మహాప్రభ)

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీ జి పి ఎస్ సీ) ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలోని ఎస్‌పీఆర్ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో నిర్వహించిన అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్--2), అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కంప్యూటర్ ఆధారిత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి, పరీక్షల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, అభ్యర్థుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జరుగుతున్నట్లు అధికారులు వివరించారు. నవంబర్‌లో నిర్వహించే అవకాశం ఉన్న తదుపరి ఆన్‌లైన్ పరీక్షల కోసం జిల్లాలోని పరీక్ష కేంద్రాలను ముందుగానే పరిశీలించి సిద్ధం చేయాలని నల్గొండ ఆర్డీఓ వై. అశోక్ రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. అలాగే పరీక్షల నిర్వహణకు అనుగుణంగా ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లను నియమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, డీఎస్పీ శివరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం యూత్ అధ్యక్షుడిగా పోల నవీన్ కుమార్



మెదక్ జిల్లా -26అక్టోబర్(మహాప్రభ).

మెదక్ జిల్లా తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం యూత్ అధ్యక్షుడుగా పోల నవీన్ కుమార్ నియామకమయ్యారు. సోమవారం రోజు హైద్రాబాద్ లో పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు.ఈ సందర్భంగా మెదక్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాకల జయరాములు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో యువతకు ప్రాధాన్యతనిస్తూ, పద్మశాలి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. హైద్రాబాద్ సమావేశానికి తరలి వెళ్లిన వారిలో కౌడిపల్లి మండల అధ్యక్షులు ఫిష్కే నర్సింలు,శ్రీనివాస్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడే దేవరకొండ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం

దేవరకొండ అక్టోబర్ 26 (మహాప్రభ)

దేవరకొండ నియోజకవర్గం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు సన్నాహక సమావేశం మంగళవారం తేదీ:-27-10-2026 రోజున ఉదయం 10 గంటలకు ఈ సమావేశం నిర్వహించబడుతుంది

సాయి శివ గార్డెన్ దేవరకొండ పట్టణంలో సమావేశం ఏర్పాటు చేయనైనది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గౌరవ మాజీ మంత్రివర్యులు సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి మరియు నల్లగొండ జిల్లా బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామావత్ రవీంద్ర కుమార్ దేవరకొండ మాజీ శాసనసభ్యులు పాల్గొని ఈ యొక్క పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లను సంబంధించి వివరించడం జరుగుతుంది కావున చందంపేట మండల బి ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీలు జడ్పిటిసిలు ఎంపీటీసీలు మాజీ సర్పంచులు ఉప సర్పంచులు గ్రామ శాఖ అధ్యక్షులు యువజన శాఖ అధ్యక్షులు మహిళా సంఘ అధ్యక్షురాలు మరియు ముఖ్యంగా గ్రాడ్యుయేట్ స్టూడెంట్ మరియు విద్యావంతులు మేధావులు పాల్గొని యొక్క కార్యక్రమానికి విజయవంతం చేయాలని కోరుతున్నాము

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

-వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి

-ఫిర్యాదుదారుల సమస్యలను నేరుగా విన్న జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్.



మెదక్ జిల్లా -26అక్టోబర్ (మహాప్రభ).

మెదక్: ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి, ఆయా సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా, విచారణ పురోగతిని బాధితులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్పష్టం చేశారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం, వేధింపులకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. వృద్ధుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వారి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎస్పీ సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

అనారోగ్యంతో బాధపడుతున్న సాధనంద్ ను పరామర్శించిన ఢిల్లీ రమేష్



దేవరకొండ అక్టోబర్ 26(మహాప్రభ)

దేవరకొండ నియోజకవర్గం, పి.ఎ. పల్లి మండలం, అంగడిపేట గ్రామానికి చెందిన మద్దిమడుగు సాధనంద్ అనారోగ్యంతో ఎల్బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారనే విషయం తెలుసుకున్న ఢిల్లీ రమేష్ వెంటనే ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు. హాస్పిటల్ వైద్యులతో మాట్లాడి సాధనంద్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరడంతో పాటు, సాధనంద్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సాధనంద్ కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటామని ఈ సందర్భంగా ఢిల్లీ రమేష్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో అంగడిపేట సర్పంచ్ చిరంజీవి,శ్రీను, గోపాల్, రామ్ మరియు తదితరులు పాల్గొన్నారు

కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తెకు ఎమ్మెల్సీ సభ్యత్వం కల్పించాలి

-మెదక్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాకల జయరాములు



మెదక్ జిల్లా -26అక్టోబర్26(మహాప్రభ).

తెలంగాణ జాతి పిత కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తె డాక్టర్ పవిత్రవాణి కి ఎమ్మెల్సీ సభ్యత్వం కల్పించాలనీ మెదక్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాకల జయరాములు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం రోజు ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడన్నారు. ఆయన నివాసమైన 'జల దృశ్యం' కేంద్రబిందువుగా నిలిచిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ బడుగు,బలహీన వర్గాల హక్కుల సాధనలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. డాక్టర్ పవిత్రవాణికి శాసన మండలి సభ్యత్వం కల్పించాలని కోరటం కేవలం ఆమె కొండా లక్ష్మణ్ బాపూజీ కుమార్తె అనే కారణంతోనే కాదని,తన విద్యార్హతలు,అనుభవం, సేవా దృక్పథం సమాజం పట్ల ఉన్న నిబద్ధత ద్వారా ఆమె పదవికి అర్హతలు కలిగి ఉన్నారన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ గారి యూనివర్సల్ ఫౌండేషన్ ద్వారా వందలాది పేద విద్యార్థులకు ఉన్నత విద్యలో శిక్షణ, ఆర్థిక సహాయం అందిస్తున్నారని ఆయన తెలిపారు. వీవర్ వెల్ఫేర్ ద్వారా పద్మశాలి విద్యార్థులకు ఉచిత వసతి,బోజన సౌకర్యాలు కల్పిస్తూ, చేనేత కార్మికులు కుటుంబాలకు చేయూత నిస్తున్నారని వెల్లడించారు.వైద్యురాలిగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ తమ సేవలు అందిస్తూన్నారనీ కొనియాడారు. ఈ నేపధ్యంలో ఆమెకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించటం ద్వారా తెలంగాణ ఉద్యమ వార సత్వానికి బీసీ సంక్షేమ,వైద్య,విద్యా రంగాలకు, చేనేతలకు సముచిత గౌరవం దక్కుతుందని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు.

దళితులపై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలి.

-దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



శివ్వంపేట, అక్టోబర్ 26.(మహా ప్రభ)

బతుకమ్మ వేడుకలలో నవాబుపేట దళితులపై దాడి చేసిన గ్రామ ఉపసర్పంచ్ ఇతర నిందితులను తక్షణమే పక్కా అరెస్ట్ చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా శివంపేట మండలం నవాబుపేట గ్రామంలో బతుకమ్మ వేడుకల్లో దాడికి గురైన బాధితులను సోమవారం నాడు కలిసి సంఘటన వివరాలను తెలుసుకున్నారు.అనంతరం సంఘటనపై విచారణకు వచ్చిన తూప్రాన్ డిఎస్పిగారు నీ కలిసి దళితులపై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా శంకర్గారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ నాడు గ్రామానికి చెందిన దళితుడైన సాయిలు తన కొడుకు సన్నీ మరో ముగ్గురు తో కలిసి డప్పు కొట్టడానికి వెళ్లగా గ్రామ ఉప సర్పంచ్ హరి గౌడ్ ,రవి గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డిలు దళితుడైన సాయిలును నాలుగు డప్పులు ఎందుకు వచ్చాయని బూతులు తిడుతూ కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారని శంకర్ తెలిపారు. తన తండ్రిని కొడుతున్నారని సన్నీ వెళ్లి అడ్డుకోగా సన్నీ నీ గొంతు పిసికీ హత్య యత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. అదే రోజు రాత్రి బాధితులు శివంపేట లోని పోలీస్ ల కు ఫిర్యాదు చేయగా వారం రోజులు తర్వాత కేసు నమోదు చేశారాని తెలిపారు. బాధితులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి సైతం తరలించకుండా పోలీసులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.తూప్రాన్ డీఎస్ పి పరిధి నవాబుపేట, పీ టి కోనా యా పల్లి, కు చారం దళితులపై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేసి బాధితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నవాబుపేట, పీ టి కోనాయిపల్లి కేసులను హత్య యత్నం కేసులు గా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిబి ఎఫ్ జిల్లా నాయకులు పంచమి చంద్రం, నరసింహులు, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీ, ఎల్లేష్, దొంతి నరసింహులుగారు, నందు తదితరులు పాల్గొన్నారు.

టెక్స్ అకాడమీ ద్వారా డిగ్రీ చదువుతున్న విద్యార్థి నూలకు

ఉచిత ఆన్లైన్ స్కాలర్‌షిప్ పరీక్ష ...



దిల్ సుక్ నగర్,అక్టోబర్ 26 (మహాప్రభ):

టెక్స్ అకాడమీ ఆధ్వర్యంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థినీలకు, ఉచితంగా కంప్యూటర్ కోర్సులను అందించడానికి ఉచిత ఆన్లైన్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించింది. పరీక్షలో విజయం సాధించిన వారికి ఉచిత కంప్యూటర్ కోర్సులను అందించనున్నారు.ఈ సందర్భంగా ఉచిత ఆన్లైన్ పరీక్షను నిర్వహించినందుకు దిల్ సుక్ నగర్ లో గల ప్రగతి డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ డైరెక్టర్ కమ్ ప్రిన్సిపల్ నన్నూరు మంజు రెడ్డి మాట్లాడుతూ ఉచిత స్కాలర్‌షిప్ పరీక్ష లో విజయం సాధించిన మణిసహస్ర పరిమి, డి.ప్రియాంక, సాత్విక కు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని జీవితం లో ఉన్నతా శిఖరాలను అధిరోహించాలని కోరుకు న్నారు. ప్రగతి డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ సెక్రటరీ మరియు కరస్పాండెంట్ నన్నూరు సీతారాం రెడ్డి మాట్లాడుతూ ఉచిత స్కాలర్‌షిప్ పరీక్ష, కోర్సులు, ప్లేస్మెంట్ అందించే డ్రైవ్ విద్యార్థుల కెరీర్ కి ఖచ్చితంగా సహాయపడతాయని అన్నారు. ఈ ఉచిత స్కాలర్‌షిప్ పరీక్ష విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధి అవకాశాల కొరకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు.కార్పొరేట్ కమ్యూనికేషన్ అసోసియేట్ మహమ్మద్ మెహమూద్ గారు ఉచిత ఆన్లైన్ పరీక్షను నిర్వహించినందుకు ప్రగతి డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ కు ధన్యవాదాలు తెలియ జేసారు. టెక్స్ అకాడమీ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్ దాస్ మాట్లాడుతూ ఉచిత ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తీర్ణులైనా వారికి శుభాకాంక్షలు తెలుపుతూ డిగ్రీ కు సంబంధించిన డేటా అనలిటిక్స్, బిజినెస్ అనలిటిక్స్, అడ్వాన్స్ ఎక్సెల్,డేటా సైన్స్, కృత్రిమ మేధస్సు కోర్సులు నెర్చుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రగతి డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మెదక్ నియోజకవర్గంలో సంక్షేమ పథకాల అమలుపై ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక దృష్టి

-కళ్యాణలక్ష్మి చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ

-పేద కుటుంబాలకు పక్కా ఇళ్ల నిర్మాణమే లక్ష్యం: ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు



మెదక్ జిల్లా -26అక్టోబర్ (మహాప్రభ).

మెదక్ నియోజకవర్గంలో అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో సోమవారం వివిధ ప్రాంతాల్లో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా కళ్యాణలక్ష్మి చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ప్రత్యేకంగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు పక్కా ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రొసీడింగ్స్ అందజేయడంపై దృష్టి సారించారు.నార్సింగి మండలంలో కళ్యాణలక్ష్మి చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. నార్సింగి మండలంలోని రైతు వేదికలో నాలుగు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రొసీడింగ్స్ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక, సామాజిక భరోసా కల్పించడం ముఖ్యమని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, పేద కుటుంబాలకు ఆహార భద్రత, నిరుపేదలకు సొంతింటి సౌకర్యం కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు చేరేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చిన్న శంకరంపేట మండలంలోని రాదేశాం ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో భాగంగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించడంలో పక్కా ఇల్లు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఇళ్లులేని నిరుపేదలకు సొంతింటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. అర్హులైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన నిబంధనలు పాటిస్తూ, అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

మెదక్ మండలానికి సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రొసీడింగ్స్‌ను మక్త భూపతిపూర్‌లోని మున్నూరు కాపు ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని పేర్కొన్నారు. ముఖ్యంగా నివాసానికి సరైన సదుపాయాలు లేని కుటుంబాలకు పక్కా ఇళ్ల సౌకర్యం కల్పించడం ద్వారా వారి జీవితాల్లో స్థిరత్వం తీసుకురావచ్చన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, వారికి అందాల్సిన ప్రయోజనాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

హవేలీ ఘనపూర్ మండలానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారులకు మెదక్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రొసీడింగ్స్ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అర్హుల గుర్తింపు, పత్రాల పరిశీలన, సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

పూరి గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు మెరుగైన నివాస సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.

మెదక్ పట్టణానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారులకు మధ్యాహ్నం 3 గంటలకు మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రొసీడింగ్స్ అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో నివసించే నిరుపేద కుటుంబాలకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పేద కుటుంబాలకు పక్కా ఇల్లు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు, భద్రతతో కూడిన గౌరవప్రదమైన జీవనానికి అవకాశం కల్పించవచ్చని పేర్కొన్నారు.లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, అవసరమైన ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు.

మెదక్ నియోజకవర్గంలోని వివిధ మండలాలు, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల ద్వారా కళ్యాణలక్ష్మి, స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల ప్రాధాన్యతను వివరించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో పూరి గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు ప్రొసీడింగ్స్ అందజేయడం ద్వారా పక్కా ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియలో ముందడుగు పడింది.

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మరింత సమర్థవంతంగా సాగేందుకు సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు.

కరువు మండలంగా మిడ్జిల్

- హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ శారద వెంకటయ్య



మిడ్జిల్, -26అక్టోబర్26(మహాప్రభ).

మిడ్జిల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పాటు రూ.50 కోట్ల నిధులు ప్రకటించడం పట్ల కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ శారద వెంకటయ్య హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి మండల ప్రజలు, రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న కరువు పరిస్థితులను గుర్తించి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కరువు ప్రభావంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.

రైతులకు భరోసా.. ప్రజలకు ఉపశమనం

మండలంలోని అన్ని గ్రామాల్లో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ఉపాధి హామీ పనులు, నీటి వనరుల అభివృద్ధి వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.50 కోట్ల నిధులు మండల అభివృద్ధికి, కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మిడ్జిల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతో పాటు నిధులు కేటాయించేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టాలని కోరారు.

సమ్మక్క సారక్క దేవాలయంలో ప్రత్యేక పూజలు





శివ్వంపేట అక్టోబర్ 26(మహాప్రభ)
శివంపేట మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామ శివారులో దట్టమైన అటవీ ప్రాంతంలో వెలసిన ప్రసిద్ధ సమ్మక్క సారక్క దేవాలయంలో సోమవారం రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారులు రెడ్డిపల్లి శశికళ, నర్సింహులు దంపతుల ఆధ్వర్యంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లను భక్తితో పూజిస్తూ, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. సమ్మక్క సారక్క అమ్మవార్లను దర్శించుకోవడం ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతత కలుగుతుందని, అమ్మవార్ల కృపతో ప్రజలకు మేలు జరగాలని పూజారులు ఆకాంక్షించారు. అటవీ ప్రాంతంలో ప్రకృతి ఒడిలో కొలువుదీరిన సమ్మక్క సారక్క దేవాలయం భక్తులకు ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తోందని, నవరాత్రి ఉత్సవాల సమయంలో అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొనడం భక్తులకు ఎంతో పవిత్రమైన అనుభూతిని కలిగిస్తుందని పేర్కొన్నారు. సోమవారం సందర్భంగా అమ్మవార్లకు పూజలు నిర్వహించడం, భక్తితో ప్రార్థనలు చేయడం మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. అమ్మవార్ల ఆశీస్సులతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ శాంతి, సంతోషాలు కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

-వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి
-ఫిర్యాదుదారుల సమస్యలను నేరుగా విన్న జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్



మెదక్ అక్టోబర్ 26,(మహాప్రభ)
ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి, ఆయా సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా, విచారణ పురోగతిని బాధితులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్పష్టం చేశారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం, వేధింపులకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. వృద్ధుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వారి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎస్పీ సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

తదుపరి విడతలోనైనా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



శివ్వంపేట అక్టోబర్ 26(మహా ప్రభ)
పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తమకు కూడా అవకాశం కల్పించాలని బాధితులు కోరుతున్నారు. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న తమ సమస్యను అధికారులు ప్రత్యేకంగా పరిశీలించి, అర్హతలను పరిగణనలోకి తీసుకొని తదుపరి విడతలోనైనా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ సమస్యనుపరిష్కరించి, సొంతింటి కలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కూరడం కావ్య, కూరడం పెంటయ్య కోరారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా పదో తరగతి మిత్రులు.. రూ.17,500 ఆర్థిక సాయం

గుండెపోటుతో మృతిచెందిన నాగయ్య కుటుంబానికి మానవత్వంతో చేయూత



శివంపేట అక్టోబర్ 26(మహాప్రభ)
శివంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన నాగయ్య వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో అతడి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న నాగయ్యతో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులు మానవత్వం చాటుకున్నారు.నాగయ్య కుటుంబాన్ని పరామర్శించిన స్నేహితులు, కష్టకాలంలో వారికి అండగా నిలుస్తూ రూ.17,500 ఆర్థిక సాయం అందించారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకుని తమ వంతు సహకారం అందించడం ద్వారా స్నేహబంధాన్ని చాటుకున్నారు. ఆపద సమయంలో స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన వారి ఔదార్యాన్ని పలువురు అభినందించారు. ఇలాంటి సహాయ కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

ఎస్సై రాజశేఖర్‌కు జెఎస్ఎస్ యూనియన్ ఘన సన్మానం



పెద్దపల్లి, అక్టోబర్ 26(మహాప్రభ)
పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గుమ్ముల రాజశేఖర్‌ను జర్నలిస్టు సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెన్నంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై రాజశేఖర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. పట్టణంలో శాంతి, భద్రతల పరిరక్షణతో పాటు, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని వారు కోరారు. పోలీసులకు, జర్నలిస్టులకు మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఉండటం సమాజానికి ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. ఎస్సై రాజశేఖర్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెఎస్ఎస్ గౌరవ అధ్యక్షుడు మంద భాస్కర్ యాదవ్, రాష్ట్ర ఈసీ సభ్యుడు కన్నూరి రాజు, వోడ్నాల లత, జిల్లా ప్రధాన కార్యదర్శి వోడ్నాల తిరుపతి, ఓమేష్, సంతోష్, ఎమ్మార్పీఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కల్వల మల్లేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు..

వాల్మీకి జీవితం ఆదర్శనీయం

-జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు
-తప్పులు తెలుసుకుని మారితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు: జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్



మెదక్ అక్టోబర్ 26,(మహాప్రభ)
మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పురాణ కథనాల ప్రకారం, తొలినాళ్లలో రత్నాకరుడిగా దారి దోపిడీలకు పాల్పడిన వాల్మీకి, సప్తర్షుల బోధనలతో ఆత్మపరిశీలన చేసుకుని తన జీవితాన్ని మార్చుకున్నారని తెలిపారు. అనంతరం కఠోర తపస్సుతో మహర్షిగా ఎదిగి, ఆదికావ్యమైన రామాయణాన్ని రచించి ప్రపంచానికి ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలను చాటిచెప్పారని పేర్కొన్నారు. మనిషి తన తప్పులను గుర్తించి సన్మార్గంలో నడవాలని సంకల్పించుకుంటే జీవితంలో గొప్ప మార్పు సాధ్యమవుతుందని వాల్మీకి జీవితం నిరూపిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన బోధనలను ఆదర్శంగా తీసుకుని సత్ప్రవర్తనతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, డీఎస్పీ రంగనాథ్, ఆర్ఐ శైలేందర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ ని కలిసిన సిద్దిపేట ఆత్మ చైర్మన్.....



సిద్దిపేట అక్టోబర్ 26,(మహాప్రభ)
భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చమల కిరణ్ కుమార్ రెడ్డి నేడు సిద్దిపేటలో మర్యాద పూర్వకంగా కలిసిన సిద్దిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ. డి సి సి కార్యదర్శి మహిపాల్ రెడ్డి.జిల్లా మైనార్టీ అధ్యక్షుడు రసాత్. యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు వాహబ్. జిల్లా ఆత్మ కమిటీ డైరెక్టర్ లు జనార్దన్.అజ్మత్.పట్టణ అధ్యక్షుడు ఆతిఫ్.యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మల ప్రవీణ్.నాగరాజు.అశోక్.శ్రీనివాస్. వంశీ.తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర లో ప్రజావాణి వెల్లువ..

-అధికారుల చుట్టూ తిరుగుతున్నా బాధితురాలికి అందని పరిహారం
-భరత్‌మాల రోడ్డు విస్తరణలో భూమి కోల్పోయిన దొంత సరిత ఆవేదన
-ఇరుగుపొరుగు వారికి అందిన డబ్బులు.. నాకేంటమ్మా ఈ అన్యాయం అంటూ బాధితురాలి కన్నీటి పర్యంతం



దేవరకద్ర, నియోజకవర్గం అక్టోబర్ 26 మహాప్రభ
ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సోమవారం దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమం పలు ఆసక్తికర ఘటనల మధ్య ముగిసింది. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించేందుకు అధికారులు ఏర్పాటు చేసిన ఈ వేదికపై పలువురు బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. మొత్తం 3 దరఖాస్తులు రాగా.. అందులో 1 రెవెన్యూ సమస్యకు సంబంధించింది కాగా, మరో 2 పింఛన్ల కోసం అందినవి. మండల ప్రత్యేక అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రజావాణికి ఎంపీడీవో శ్రీనివాసరావు, తహశీల్దార్ (ఎమ్మార్వో) హర్షత్ తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరై అర్జీలను స్వీకరించారు. అయితే, ఈ కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తుల్లో ఓ మహిళా బాధితురాలి వ్యథ అక్కడి అధికారులను, స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

రోడ్డు విస్తరణలో భూమి పోయింది.. పరిహారం మాత్రం రాలేదు!

దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద గోపులాపూర్ శివారులో భరత్‌మాల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ విస్తరణలో దొంత వెంకటేష్, సరిత దంపతులకు చెందిన భూమి బలియైంది. సర్వే నంబర్ 59/5 లో మొత్తం 8 కుంటల భూమి ఉండగా.. అందులో రోడ్డు విస్తరణ నిమిత్తం ఏకంగా 4 కుంటల భూమిని కోల్పోయారు.

కానీ, ఇంతవరకు తమకు ఎలాంటి పరిహారం అందలేదని బాధితురాలు దొంత సరిత వాపోయారు. సరిహద్దుల్లో ఉన్న పక్క భూముల యజమానులకు ఎప్పుడో ప్రభుత్వ పరిహారం అందగా.. తమకు మాత్రం ఇప్పటివరకు రూపాయి కూడా విదిలించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఎవరి నుంచి స్పందన లేదని, అసలు రోడ్డు విస్తరణ జాబితాలోనే తన పేరు రాలేదని కన్నీటిపర్యంతమయ్యారు.

అధికారుల హామీ..

ఇదే విషయమై సోమవారం జరిగిన ప్రజావాణిలో బాధితురాలు సరిత అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. సర్వే నంబర్ 59/5 లోని తమ నాలుగు కుంటల భూమికి రావలసిన పరిహారాన్ని వెంటనే ఇప్పించాలని, జాబితాలో పేరు లేకపోవడానికి కారణాలను సరిదిద్దాలని ఆమె వేడుకున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మార్వో హర్షత్, ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బాధితురాలి దరఖాస్తును పరిశీలించి, రికార్డులను సరిచేసి త్వరలోనే న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

బాధితురాలికి రావాల్సిన న్యాయమైన పరిహారం దక్కేలా ఉన్నతాధికారులు స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గణపతి సచ్చిదానంద స్వామీజీ పాదపూజ మహోత్సవం



మంథని, అక్టోబర్ 26 మహాప్రభ మంథని పట్టణంలో అవధూత దత్త పీఠాధిపతి పరమ పూజ్య గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య సన్నిధిలో పాదపూజ మహోత్సవాన్ని నవంబర్ 1న నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు హాజరవుతారు. ధన్వాడ, మంథని ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక కార్యక్రమానికి అనుగుణంగా నిర్వహిస్తున్న ఈ మహోత్సవంలో భక్తులు పాల్గొని స్వామీజీ ఆశీస్సులు పొందాలని మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, బీహెచ్ఈఎల్ ఆశ్రమం అవధూత దత్తపీఠం ట్రస్టు రాజవరం సచివ్రు, దుద్దిళ్ల గణపతి, శశి భూషణ్ కాచే కోరుతున్నారు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, భక్తి మార్గాన్ని ప్రజలకు చేరువ చేయడంతో పాటు సమాజంలో శాంతి, సంతోషం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. నవంబర్ 1న ఆదివారం ఉదయం 10 గంటలకు ధన్వాడలో కార్యక్రమం ప్రారంభమై, మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనుంది. మంథని మున్సిపాలిటీ పరిధిలోని కేకే గార్డెన్స్‌లో ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తారు..

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com